గురువారం
16-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 263
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అరుణాచల్...
భారత్ అంతర్భాగమే: అమెరికా

అరుణాచల్ ప్రదేశ్... భారత్‌లో అంతర్భాగమని అమెరికా పేర్కొంది. సరిహద్దుల వద్ద యథాతథ స్థితిని చైనా మార్చడానికి యత్నిస్తోందంటూ సెనెట్‌లో ప్రవేశపెట్టిన తీర్మానంలో సభ్యులు ఆరోపించారు.

2లో

అసెంబ్లీ గరం గరం

- గవర్నర్ అంశంపై అసత్య ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీ ఆగ్రహం
- రాజ్యాంగ పదవిని అవమానించారని టీడీపీ ధ్వజం
- అధికార, ప్రతిపక్షాల పరస్పర విమర్శలు
- టీడీపీ సభ్యులంతా సస్పెండ్
- కేశవ్, రామానాయుడు, కోటంరెడ్డిపై సెషన్ మొత్తానికి వేటు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బుధవారం గరంగరంగా సాగింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించడానికి విచ్చేసిన గవర్నర్‌ను ఆహ్వానించడంలో ప్రభుత్వ తీరు సక్రమంగా లేదని టీడీపీ సభ్యులు విమర్శించారు. దీనికి ప్రతిగా వైసీపీ సభ్యులు ఎదురుదాడికి దిగారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పర విమర్శలకు దిగడం రభసకు దారితీసింది. గవర్నర్‌ను రాజ్యాంగ నిబంధనల మేరకు గౌరవ మర్యాదలతో ఆహ్వానించినప్పటికీ టీడీపీ సభ్యులు అసత్య ప్రచారానికి పాల్పడి, రాజ్యాంగ పదవిని అవమానిస్తున్నారని శాసనసభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రతిపక్ష సభ్యులపై మండిపడ్డారు. గవర్నర్‌ను ఆహ్వానించడానికి సీఎం జగన్ ముందే అసెంబ్లీకి వచ్చారని చెబుతూ దానికి సంబంధించిన వీడియోను శాసనసభలో ప్రదర్శించి చూపారు. వాస్తవానికి విరుద్ధంగా దుష్ప్రచారం చేసిన ప్రతిపక్ష సభ్యులపై చర్యలు ఎందుకు తీసుకోకూడదని ప్రశ్నించారు. దీనిపై పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దమ్ముంటే తాను మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ కూడా ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. తనకు మైక్ ఇస్తే వివరణ ఇస్తానని స్పీకర్‌ను కోరారు. కానీ స్పీకర్ మైక్ ఇవ్వకపోవడంతో పయ్యావుల స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. దమ్ముంటే తాను మాట్లాడిన

- మిగతా 2 లో

విచారణేది?

- అదానీ వ్యవహారంపై ఈడీకి ప్రతిపక్ష ఎంపీల ప్రశ్న
- ఈ-మెయిల్‌లో లేఖ
- పార్లమెంటు నుంచి ఎంపీల ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు

న్యూఢిల్లీ: అదానీ అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని 18 ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. అదానీ గ్రూపు అవినీతి, షెల్ కంపెనీల ద్వారా జరిగిన మనీలాండరింగ్ వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని డిమాండ్ చేశాయి. ఈ వ్యవహారంలో విచారణకు ఎందుకు ఆసక్తి చూపడం లేదని, విపక్షాల నేతలపై దర్యాప్తు అంటే దూకుడు ప్రదర్శిస్తారు కదా అని ఈడీని నిలదీశాయి. అదానీ వ్యవహారంలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ బుధవారం ఓ లేఖను ఈడీ డైరెక్టర్ ఎస్‌కే మిశ్రాకు ఈ-మెయిల్ ద్వారా విపక్షాల ఎంపీలు పంపారు. విధి ధర్మానికి కట్టుబడాలని, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ లేఖపై కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, జేడీయూ, ఎస్ఎస్ (యూబీటీ), ఆర్జేడీ, డీఎంకే, జేఎంఎం, ఆప్, ఐయూఎంఎల్, వీకేసీ, కేరళ కాంగ్రెస్ తదితర 18 ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సంతకాలు చేశారు.

జేపీసీ వేయాల్సిందే

అదానీ వ్యవహారంలో జేపీసీ విచారణ కోసం డిమాండ్ చేస్తూ పార్లమెంటు నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయం వరకు ప్రతిపక్షాల ఎంపీలు ర్యాలీ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదానీ అంశంపై విచారణ కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. అదానీ వ్యవహారంపై వినతిపత్రాన్ని ఈడీ డైరెక్టర్‌కు అందజేయాలని ఎంపీలు భావించారు. అయితే అజయ్ చౌక్ వద్దకు చేరుకున్న ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నదని, ముందుకెళ్లేందుకు వీల్లేదని తెలిపారు. ప్రదర్శనలు, నిరసనలు, ఆందోళనలకు అనుమతి లేదన్నారు. బారికేడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా భారీగా బలగాలను మోహరించారు. దీంతో అజయ్ భవన్ వద్ద ర్యాలీని ఆపేసిన ఎంపీలు పార్లమెంట్‌కు తిరిగివెళ్లారు.

మా గళాన్ని అణచివేస్తున్నారు: ఖడ్గే

బ్రిటన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ వర్గాల ఆరోపణలను కాంగ్రెస్ తోసిపుచ్చింది. ఆయన క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నవారు గతంలో విదేశాల్లో మాట్లాడినప్పుడు దేశ ప్రజల గురించి

- మిగతా 2 లో

ఈడీ విచారణపై
'స్టే' ఇవ్వలేం

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- నేడు ఈడీ ఎదుట హాజరుకానున్న కవిత

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ విచారించకుండా 'స్టే' ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో కవిత గురువారం ఈడీ విచారణకు హాజరు కావాల్సిన అనివార్య పరిస్థితులు నెలకొన్నాయి. కాగా ఈడీ విచారణకు తాను హాజరవుతున్నట్లు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్న కవిత ప్రకటించారు. ఈడీ ఎదుట హాజరయ్యే ముందు మీడియాతో మాట్లాడుతానని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాటం ఆగదని, మహిళలకు తమ పార్టీతో సహా ఎవరూ ఎక్కువ అవకాశాలు ఇవ్వడం లేదని కవిత అన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం కోసం ఒత్తిడి చేస్తామని కవిత స్పష్టం చేశారు. అంతకుముందు ఈడీ విచారణపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై ఈ నెల 24న విచారణ చేస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కాగా ఈ పిటిషన్ ను అత్యవసరంగా విచారించాలని కవిత తరపు న్యాయవాదులు

- మిగతా 2 లో

మహిళా బిల్లు ఎందుకు పెట్టరు?
మోదీ ప్రభుత్వానికి నారాయణ ప్రశ్న

8లో

జగన్ సర్కార్‌కు
మళ్లీ ఝలక్

ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని పిలవాల్సిందే

హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జగన్ సర్కారుకు హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సమావేశాలకు ప్రభుత్వ ఉద్యోగ సంఘాన్ని ఆహ్వానించాలని హైకోర్టు ఆదేశించింది. జీతాలు సకాలంలో అందక, డీఏ బకాయిలు, వైద్య ఖర్చుల బిల్లులు తిరిగి చెల్లింపు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ బకాయిలు తదితర డిమాండ్లలో ఏ ఒక్కటీ చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరపాలని నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు ప్రభుత్వ సలహాదారు సజ్జల

- మిగతా 2 లో

డీఎస్సీ-1998 అభ్యర్థులకు
శుభవార్త

- కాంట్రాక్టు పద్ధతిలో 4,534 మంది నియామకం
- ప్రభుత్వం ఉత్తర్వుల జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డీఎస్సీ-1998 అర్హతా అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. డీఎస్సీ-1998లో అర్హత సాధించిన 4,534 మంది అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాల విద్య కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీజేశారు. దీనిద్వారా డీఎస్సీ-1998లో 4,534 మంది అభ్యర్థులు ఎస్జీటీలుగా కాంట్రాక్టు పద్ధతిలో నియమితులవుతారు. వారందరికీ మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ద్వారా వేతనాలిస్తారు. చాలాకాలం నుంచి డీఎస్సీ-1998 బ్యాచ్ అర్హత పొందిన

- మిగతా 2 లో

ప్రగతి పథంలో ఏపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సామాజిక ఆర్థిక సర్వే గణాంకాల ప్రకారం ఏపీలో వృద్ధి 16.2 శాతంగా నమోదైంది. శాసన సభలోని సీఎం చాంబర్‌లో 2022-23 సామాజిక సర్వేను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. అనంతరం ప్రణాళికశాఖ కార్యదర్శి విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ... జాతీయ సగటు కంటే రాష్ట్ర తలసరి ఆదాయం ఎక్కువగా నమోదైందని వివరించారు. గతంతో పోల్చితే రూ.1.18లక్షల కోట్లు జీఎస్డీపీ పెరిగిందన్నారు. వ్యవసాయంలో 13.18శాతం, పరిశ్రమల్లో 16.36శాతం, సేవా రంగంలో 18.91 శాతం వృద్ధి నమోదైందన్నారు. 36శాతం కంట్రిబ్యూషన్ వ్యవసాయం నుంచి వస్తోందని, అన్ని రంగాల్లోనూ అభివృద్ధి కన్పిస్తోందని విశ్లేషించారు. విద్య, ఆరోగ్య రంగాల్లో అనూహ్య అభివృద్ధి సాధించామని, శిశు మరణాలు గణనీయంగా తగ్గాయని విజయ్‌కుమార్ వివరించారు.

బడ్జెట్ రూ.2,60,000 కోట్లు

నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న మంత్రి బుగ్గన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌ను ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ప్రశ్నోత్తరాల అనంతరం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా, వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి ప్రవేశపెట్టనున్నారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఈసారి రాష్ట్ర బడ్జెట్ గత ఏడాది కంటే పెరగనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గురూ, నీకోసం జులైలో
వైజాగ్ తరలివస్తున్నాం
నీకింక పండగే, పండుగ!

పేదోడితోనే ప్రయాణం

- పెత్తందార్లతో యుద్ధమే
- ఇదే నా ఎకనామిక్స్- నా పాలిటిక్స్
- ఎన్నికల మేనిఫెస్టో 98.5శాతం అమలు
- మంచి జరిగిందని భావిస్తేనే మద్దతివ్వండి
- అసెంబ్లీలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'నా నడక నేల మీదే. నా ప్రయాణం పేదలతోనే. నా యుద్ధం పెత్తందార్లతోనే. నా లక్ష్యం పేదరిక నిర్మూలన. ఇదే నా ఎకనామిక్స్. ఇదే నా పాలిటిక్స్. ఇదే నా తండ్రిని చూసి నేర్చుకున్న హిస్టరీ. ఇవన్నీ కలిపితేనే మీ జగన్' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా శాసనసభలో సీఎం జగన్ గత నాలుగేళ్లలో తమ ప్రభుత్వం పేదరిక నిర్మూలన, రాష్ట్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలను వివరించారు. పేదవాడికి తోడుగా, ప్రతి ఇంటికీ మంచి చేసిన ప్రభుత్వంగా... సామాజిక న్యాయం, మహిళా న్యాయం, రైతన్నలకు న్యాయం... వీటన్నింటినీ

- మిగతా 2 లో

నోబెల్‌గ్రహీత కెంజాబురో ఓయ్ కన్నుమూత

టోక్యో : జపాన్‌కు చెందిన నోబెల్‌గ్రహీత, ప్రముఖ సాహిత్యవేత్త కెంజాబురో ఓయ్ మృతి చెందారు. కెంజాబురో (88) వృద్ధాప్య సమస్యలతో ఈనెల 3న మరణించినట్లు ప్రచురణకర్త కొడంషా లిమిటెడ్ తాజాగా ప్రకటించింది. కెంజాబురో 1994లో సాహిత్యంలో నోబెల్ అవార్డు గెలుచుకుని ఈ ఘనత సాధించిన రెండో జపనీయుడు. చిన్నతనంలో జపాన్ యుద్ధ అనంతర జ్ఞాపకాలతో చేసిన రచనలతో కెంజాబురో గుర్తింపు తెచ్చుకున్నారు. 1963లో మానసిక వికలాంగుడైన కుమారుడి జననం కూడాఆ యన రచనలపై ప్రభావం చూపింది. తండ్రిగా తన బాధ, ఆ అంధకారానికి అక్షరరూపమిచ్చి 'ది పర్సనల్ మ్యాటర్' పుస్తకం ప్రచురించారు. అది సాహితీప్రియుల మన్ననలతో పాటు విమర్శకుల ప్రశంసలు పొందింది. 'ది క్యాచ్' కూడా కెంజాబురోకు మంచి పేరు తెచ్చింది.

అన్ని వీసాల జారీకి చైనా పచ్చజెండా

బీజింగ్: కోవిడ్ నేపథ్యంలో మూడేళ్ల నుంచి సరిహద్దులను మూసి ఉంచడమే కాకుండా పర్యాటకాన్ని చైనా పూర్తిగా స్తంభింపజేసింది. దీంతో పర్యాటక ఆదాయం పడిపోయింది. ఇప్పుడు ఆ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు మూడేళ్ల తర్వాత సరిహద్దులు తెరిచేందుకు చైనా నిర్ణయించింది. వీసాలు అవసరం ఉన్న వారితో పాటు హాంకాంగ్, మకావు, హైనన్ ఐలాండ్ నుంచి వీసా అక్కర్లేని పర్యాటకులకు తమ దేశంలోకి అనుమతిస్తున్నట్లు ప్రకటించింది. 2020 మార్చి 28కు ముందు విదేశీయులకు జారీ చేసిన వీసాలు చెల్లుబాటవుతాయని పేర్కొంది.

అరుణాచల్... భారత్ అంతర్భాగమే: అమెరికా

వాషింగ్టన్: అరుణాచల్ ప్రదేశ్... భారత్‌లో అంతర్భాగమని అమెరికా పేర్కొంది. సరిహద్దుల వద్ద యథాతథ స్థితిని చైనా మార్చడానికి యత్నిస్తోందంటూ సెనెట్‌లో ప్రవేశపెట్టిన తీర్మానంలో సభ్యులు ఆరోపించారు. 'ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మన వ్యూహాత్మక భాగస్వాములకు అండగా నిలవటం ముఖ్యం. సెనెట్‌లో ప్రవేశపెట్టిన ఈ తీర్మానం వాస్తవాధీన రేఖ వద్ద యథాతథ స్థితిని మార్చేందుకు చైనా చేస్తోన్న యత్నాలను ఖండిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగం అని నిస్సందేహంగా గుర్తిస్తోంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సుస్థిరత కోసం అమెరికా-భారత్ భాగస్వామ్యాన్ని, క్వాడ్‌ను మెరుగుపరుచుతాం' అని సెనేట్ తీర్మానించింది. చైనా, అరుణాచల్ ప్రదేశ్ మధ్య మెక్‌మోహన్ రేఖనే అంతర్జాతీయ సరిహద్దుగా అమెరికా గుర్తిస్తోందని పునరుద్ఘాటించింది.

తాలిబన్లకు భారత్ ఆర్థిక, దౌత్య పాఠాలు...



కాబూల్: భారత విదేశాంగ శాఖ నిర్వహించే నాలుగు రోజుల కార్యక్రమానికి తాలిబన్ దౌత్యవేత్తలు హాజరవుతారని కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో-ఆపరేషన్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ ఇమ్మెర్షన్ అనే కోర్సును భారత విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో ఐఐఎం కోజికోడ్ నిర్వహిస్తోంది. ఈనెల 14 నుంచి 17 వ తేదీ వరకు ఆన్‌లైన్ వేదికగా ఇది జరగనుంది. ఇందులో అఫ్గానిస్థాన్ నుంచి తాలిబన్ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ కోర్సులో పలు దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ కోర్సులో పాల్గొనేవారికి భారత ఆర్థిక వాతావరణం, సాంస్కృతిక వారసత్వం, సామాజిక వెనుకబాటు, నాయకత్వం, చారిత్రక నేపథ్యం, పర్యావరణం, వ్యాపార నిర్వహణలో కలిగే నష్టాలు వంటి అంశాల గురించి వివరిస్తారు. ఈ కోర్సులో ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు, సంస్థల ప్రతినిధులుతో కలిపి సుమారు 30మంది వరకు పాల్గొనవచ్చు

ఆఫ్రికాలో ఫ్రెడ్డీ బీభత్సం- 216 మంది మృతి

బ్లాంటైర్ (మలావి): ఆఫ్రికాలోని మలావి, మొజాంబిక్ దేశాలలో 'ఫ్రెడ్డీ' తుపాను అల్లాడిస్తోంది. నెల రోజుల క్రితం ఆస్ట్రేలియాలో ప్రారంభమైన ఈ తుపాను ఆఫ్రికాపై విరుచుకు పడి బీభత్సం సృష్టిస్తోంది. దక్షిణ, మధ్య ఆఫ్రికాలోని ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షం, గాలులతో పెద్దసంఖ్యలో చెట్లు నెలకొరిగాయి. రాకపోకలు స్తంభించాయి. విద్యుత్తు సరఫరా స్తంభించింది. సమాచార వ్యవస్థలు పనిచేయడం లేదు. తుపాను ధాటికి ఇప్పటివరకు 216 మంది మరణించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. నదలు ఉప్పొంగి ఎందరో ప్రజలు కొట్టుకుపోయారు. మలావిలో ఎమర్జెన్సీని ఆ దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా ప్రకటించారు. దక్షిణ, మధ్య ఆఫ్రికాలో సహాయక చర్యలకు వాతావరణం అనుకూలించగా ఆటంకం కలుగుతోంది.

నరహంతకుడికి 1310 సంవత్సరాల జైలుశిక్ష

శాన్ సాల్వదార్: ఉత్తర అమెరికా దేశమై ఎల్ సాల్వదార్‌లో పోలీసులు ఓ భయంకర నరహంతకుడిని అరెస్టు చేశాడు. అతను 33 హత్యలు చేశాడు. మరో తొమ్మిది హత్యలకు కుట్రపన్నాడు. అనేక ఇతర ప్రమాదకర నేర కార్యకలాపాలకు పాల్పడ్డాడు. అందుకే ఈ ప్రమాదకర నేరస్తుడికి అక్కడి న్యాయస్థానం ఏకంగా 1310 సంవత్సరాల జైలుశిక్ష విధించింది. విల్మేర్ సెగోవియా అనే ఆ కరుడుగట్టిన నేరగాడు మారా సాల్వట్రుచ ముఠాకు చెందిన వాడు. ఈ ముఠా... ఎల్ సాల్వెడార్‌లో ఎన్నో క్రూరమైన నేరాలకు పాల్పడింది. దీనిని ఎంఎస్-13 అని కూడా అంటారు. అయితే, ఒక నేరస్తుడికి ఏకంగా 13 శతాబ్దాలకుపైగా శిక్ష విధించడం అనేది ఇక్కడ అశ్చర్యకర విషయం. అయితే, ఇదే ఎల్ సాల్వెడార్ దేశంలో ఇటీవల మరో నరహంతకుడికి కూడా అత్యంత దీర్ఘకాల శిక్ష పడింది. మిగ్వెల్ ఏంజిల్ పోర్టిల్లో అనే గ్యాంగ్‌స్టర్ మొత్తం 22 క్రూర హత్యా నేరాలు చేశాడు. అంతేగాక అనేక హత్యాయత్నాలు, దాడులు, బలవంతపు వసూళ్లలో అతని పాత్ర ఉంది. దాంతో మిగ్వెల్‌కు అక్కడి న్యాయస్థానం ఏకంగా 945 సంవత్సరాల జైలుశిక్ష విధించింది. కాగా, ఈ కరుడుగట్టిన మారా సాల్వట్రుచ గ్యాంగ్‌లో ఏకంగా 60 వేల మంది వరకు సభ్యులు ఉన్నారని అక్కడి ప్రభుత్వం చెబుతోంది. ఇప్పుడు వాళ్లందరినీ జైల్లో పెట్టేందుకు ఒక పక్కా ప్రణాళికను రచిస్తోంది. ఇప్పటికే కొన్ని వేల మంది గ్యాంగ్ సభ్యులు ఎల్ సాల్వెడార్ జైళ్లలో ఉన్నారు. తాజాగా నిర్మించిన కొత్త జైలులోకి మారా సాల్వట్రుచ గ్యాంగ్‌కు చెందిన రెండువేల మందిని తరలించారు.

అసెంబ్లీ గరం గరం

(మొదటిపేజీ తరువాయి)

వీడియోను ప్రదర్శించాలని పదేపదే డిమాండ్ చేశారు. దమ్ముంటే అనే పద ప్రయోగంపై మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వచ్చే దమ్ము లేకనే చంద్రబాబు గైర్హాజరవుతున్నారని, దమ్ము లేకనే టీడీపీ 23 సీట్లకు పరిమితమైందని మంత్రులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టీడీపీ, వైసీపీ సభ్యులు పరస్పరం విమర్శలు, ప్రతి విమర్శలకు దిగడంతో సభలో గందరగోళం ఏర్పడింది. టీడీపీ సభ్యులంతా స్పీకర్ పోడియం చుట్టుముట్టి మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ పట్టుబట్టారు. చివరకు కేశవ్‌కు స్పీకర్ అవకాశం ఇచ్చి... ఆయన మాట్లాడుతూ ఉండగానే మైక్ కట్ చేశారు. దీంతో టీడీపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోడియంను చుట్టుముట్టి నిరసన తెలియజేశారు. ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా, సభా గౌరవాన్ని తగ్గించేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని శాసనసభ వ్యవహారాల మంత్రి బుగ్గన స్పీకర్‌ను కోరారు. ఈ వ్యవహారాన్ని ప్రివిలేజ్ కమిటీకి ఇస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అదే సమయంలో ఈ విధమైన వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేలు కేశవ్, రామానాయుడులను సమావేశాలు పూర్తయ్యేంత వరకూ సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం తీర్మానం ప్రతిపాదించింది. వీరికి మద్దతుగా నిలుస్తూ ఆందోళన కొనసాగిస్తున్న మిగిలిన టీడీపీ ఎమ్మెల్యేలు కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మకాయల చినరాజప్ప, ఆదిరెడ్డి భవాని, గద్దె రామమోహన్, రామరాజు, ఏలూరి సాంబశివరావు, డోలా వీరాంజనేయస్వామి, గణబాబు, జి.రవికుమార్, బెందాళం అశోక్‌లను ఒక్కరోజు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

కోటంరెడ్డిపై సస్పెన్షన్ వేటు

టీడీపీ సభ్యులతోపాటు వైసీపీ రెబల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిపైనా సస్పెన్షన్ వేటు పడింది. ఉదయం సభ మొదలైనప్పటి నుంచి కోటంరెడ్డి నిరసన తెలియజేస్తూనే ఉన్నారు. తన నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని సభలో నినాదాలు చేశారు. మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పీకర్ ప్రశ్నోత్తరాలు చేపట్టిన వెంటనే నియోజకవర్గ సమస్యలను ప్రస్తావిస్తూ కోటంరెడ్డి ప్లకార్డుతో సభలో నిలబడ్డారు. దీంతో ప్రశ్నోత్తరాలలో సభ్యుడు మధ్యలో మాట్లాడకూడదని స్పీకర్ తెలిపారు. 'శ్రీధర్ రెడ్డి..మీరు ప్రభుత్వానికి సమస్యలు చెప్పుకోవాలంటే నేను గవర్నమెంట్‌కు తెలియజేస్తాను. మీరు చేస్తున్న ప్రొటెస్ట్‌ను హౌస్, నేను కూడా గుర్తించాం. మీరు కంటిన్యూగా ఇలా చేయడం తగదు. మీరు కూర్చుంటే ప్రభుత్వం స్పందిస్తుంది' అని స్పీకర్ తమ్మినేని తెలిపారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్పందిస్తూ సమస్యలు లేని సొసైటీ ఉండదని, సమస్యలను ఏ వేదికలో తీర్చుకోవాలనేది తెలుసుకోవాలని హితవు పలికారు. గవర్నర్ ప్రసంగం జరగాల్సిన సమయంలో వ్యక్తిగత అంశాలు అడగడం సమంజసం కాదని తెలిపారు. కోటంరెడ్డి ఇబ్బందులను చెబితే తాము స్పందిస్తామన్నారు. మంత్రి అంబటి రాంబాబు మట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి కావాలనే రగడ చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. ఆయన సభను ఇబ్బందిపెట్టి ప్రజల దృష్టిలో పడాలని చూస్తున్నారని విమర్శించారు. టీడీపీ సభ్యులకు తెల్లారే సరికి శ్రీధర్‌రెడ్డిపై ప్రేమ వచ్చేసిందంటూ ఎద్దేవా చేశారు. శ్రీధర్‌రెడ్డి ఇక్కడకు వచ్చి తెలుగుదేశంతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. శ్రీధర్‌రెడ్డి నమ్మక ద్రోహి అని, ఆయనకు అవకాశం ఇవ్వవద్దు, అవసరం అయితే చర్యలు తీసుకోండి అంటూ స్పీకర్‌కు మంత్రి అంబటి విన్నవించారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన వ్యక్తి, జగన్ ఫొటో పెట్టుకుని, ఫ్యాన్ గుర్తుపై గెలిచి పార్టీకి నమ్మకద్రోహం చేశారని మంత్రి జోగి రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సమయం దాదాపు గంటన్నర సేపు ప్లకార్డు ప్రదర్శిస్తూ అసెంబ్లీలో నిలబడే ఉన్న శ్రీధర్‌రెడ్డి, విరామం తర్వాత కూడా దాదాపు రెండు గంటల పాటు అసెంబ్లీలో నిలబడి నిరసన తెలియజేశారు. చివరకు ఆయనపైనా ఈ సెషన్ మొత్తాన్నికి సస్పెన్షన్ వేటు వేయగా, తనను ఎందుకు సస్పెండ్ చేశారంటూ కోటంరెడ్డి స్పీకర్ పోడియం ఎదుట నిరసనకు దిగారు.

జగన్ సర్కార్‌కు మళ్లీ ఝలక్

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణారెడ్డి ఉద్యోగ సంఘాల నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డి, ఏపీ ఎన్జీవోల సంఘం నుంచి బండి శ్రీనివాసరావును ఆహ్వానించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గతంలో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడని ప్రభుత్వ జీఈఏ అధ్యక్షుడు సూర్యనారాయణను ఆహ్వానించలేదు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 7న ఉద్యోగ సంఘాలతో జరిగిన మంత్రుల కమిటీ భేటీ అధికారికం కాదని ప్రభుత్వ తరపు న్యాయవ్యాది కోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు విన్న న్యాయస్థానం ప్రభుత్వ లాయర్ వాదనలను తోచిపుచ్చుతూ సూర్యనారాయణను ఆహ్వానించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఇమ్రాన్ ఖాన్‌కి తాత్కాలిక ఊరట

అరెస్టుకు ఆగని చర్యలు - రంగంలోకి సైన్యం?

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కి తాత్కాలిక ఊరట లభించింది. ఆయన నివాసం ఎదుట గురువారం ఉదయం 10 గంటల వరకు పోలీసులు చేపడుతున్న చర్యలను నిలిపివేయాలని లాహోర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తారిఖ్ సలీమ్ షేక్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీసుల చర్యలను సవాలు చేస్తూ పీటీఐ పార్టీ నేత ఫవాద్ చౌదరి హైకోర్టును ఆశ్రయించారు. బహుమతులను అమ్ముకున్న కేసులో ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేసేందుకు అక్కడి ప్రభుత్వం శతవిధాల యత్నిస్తోంది. లాహోర్‌లోని జమాన్ పార్క్ వద్దనున్న ఆయన నివాసాన్ని పోలీసులు చుట్టుముట్టారు. ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు అక్కడికి చేరుకుని ఆయనను అరెస్టు చేయకుండా పోలీసులకు అడ్డుపడ్డారు. ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు బుధవారం కూడా యత్నించారు కానీ కుదరలేదు.పీటీఐ మద్దతుదారులను చెదరగొట్టేందుకు పోలీసులు జలఫిరంగులు, బాష్పవాయువును ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. ఈ ఘటనల వీడియోలు, ఫోటోలు పాకిస్తాన్‌లో వైరలయ్యాయి. ఇమ్రాన్‌ను అరెస్టు చేసేందుకు పాకిస్తాన్ సైన్యం రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇస్లామాబాద్ డీఐజీ ఆపరేషన్స్ షాజామ్ నదీమ్ బుఖారీతో పాటు 54 మంది పోలీసులకు గాయాలైనట్లు తెలుస్తోంది. అలాగే పదుల సంఖ్యలో పీటీఐ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారని సమాచారం.

సీపీఎస్ రద్దు చేయాలి

ఏపీ జేఏసీ అమరావతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేస్తామంటూ సీఎం జగన్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరాతి డిమాండ్ చేసింది. ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఏడోరోజు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. విజయవాడ రవాణాశాఖ, ఆర్టీసీ డిపోలతోపాటు, సమాచార, పౌరసంబంధాల శాఖ, డీఎంఈ, అగ్నిమాపకదళ, కార్మికశాఖ కార్యాలయాలకు జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావుతో కూడిన నేతల బృందం వెళ్లింది. అక్కడి ఉద్యోగులను ఉద్యమాలకు సన్నద్ధం చేసింది. బొప్పరాజు వెంకటేశ్వర్లు, దామోదరరావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేస్తామన్న హామీని జగన్ ప్రభుత్వం నిలబెట్టుకోలేక పోయిందన్నారు. పక్క రాష్ట్రాల ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తుంటే, జగన్ ప్రభుత్వం మౌనంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఏపీ జేఏసీ అమరావతి నాయకత్వం పోరాడుతుందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక...సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉత్పన్నమవుతున్న అనేక ఇబ్బందులైన, సమస్యల పరిష్కారంపైన దృష్టి పెడతామన్నారు. ఏపీ జేఏసీ అమరావతి పిలుపునిచ్చిన దశల వారీ కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని కోరారు. డీఎంఈ కార్యాలయంలో నిరసనలో ఉన్న సిబ్బందిని ఏపీ జేఏసీ అమరావతి నేతలు కలిశారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు అర్హతగల కాంట్రాక్టు ఉద్యోగులందరినీ తక్షణమే క్రమబద్ధీకరించాలని, ఇప్పటికే 22 ఏళ్లుగా ఎలాంటి ప్రయోజనాలు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మల్లేశ్వరరావు, వీఆర్వో రాష్ట్రకార్యదర్శి ఏ సాంబశివరావు, జేఏసీ ప్రచార కార్యదర్శి బి.కిశోర్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా-ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ డి.ఈశ్వర్, ప్రధానకార్యదర్శి వై.శ్రీనివాసరావు, రెవెన్యూ అసోషియేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డి.శ్రీనివాస్, బత్తినరామకృష్ణ, గ్రామ సచివాలయ రాష్ట్ర కార్యదర్శి బగ్గా జగదీష్, రెవెన్యూ అసోషియేషన్ రాష్ట్రకార్యదర్శి ప్రవీన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్ రూ.2,60,000 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.2,60,000 కోట్లతో బడ్జెట్ కూర్పు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 64 లక్షల మంది వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు నెలకు రూ.2,750 పెన్షన్ అందజేస్తుండగా, జనవరి 1వ తేదీ నుంచి 3వేలకు పెంచి ఇవ్వనున్నారు. ఆ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపు భారీగా పెరగనుంది. నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తున్న విద్య, వైద్యరంగాలతోపాటు జగనన్న ఇళ్లు, కాలనీలకు మౌలిక సదుపాయాల నిమిత్తం నిధుల కేటాయింపునకు బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చినట్లు తెలిసింది.

తెలంగాణను ఆదర్శంగా తీసుకుందాం

ముంబై: మహారాష్ట్ర సీనియర్ నేత, నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ప్రకాశ్ దాదా సోలంకి బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలోనూ తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఆయన డిమాండ్ చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రకాశ్ దాదా మాట్లాడుతూ రాష్ట్రం 'సర్‌ప్లస్' అవుతుంది అనే మాటలు ఆపాలని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలి కారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని గమనించాలని సూచించారు. రైతులకు ఇవ్వాలనే తపన ఉండాలని, మంచి చేయాలనే సంకల్పముండాలని, అందుకు తెలంగాణ రాష్ట్రం ఒక ఉదాహరణ అని అన్నారు. ఆ రాష్ట్రం మోడల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పేదోడితోనే ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

దైవకార్యంగా భావించి నిబద్ధతతో అడుగులు వేస్తున్న మనందరి ప్రభుత్వానికి...మీరంతా మంచి జరిగిందని భావిస్తేనే మద్దతివ్వాలని ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రజలను కోరారు. తన నాలుగేళ్ల పాలనలో ఎలాంటి లంచాలకు, వివక్షకు చోటులేకుండా పారదర్శకంగా, నేరుగా ప్రజల ఖాతాల్లోకి డీబీటీ ద్వారా అక్షరాలా రూ.2 లక్షల కోట్లు బదిలీ చేశామని వివరించారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో డీబీటీ జరగలేదని చెప్పడానికి గర్వపడుతున్నానన్నారు. ఇందులోనూ 76 శాతం నేరుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే అందిందని చెప్పడానికి ఇంకా గర్వంగా ఉందని చెప్పారు. తనకు పరిశ్రమలు ఎంత ముఖ్యమో.. వ్యవసాయం కూడా అంతే ముఖ్యమని, ఐటీ ఎంత ముఖ్యమో.. చిరువ్యాపారులు, బీసీ, ఎస్సీ, కులవృత్తుల వారూ అంతే ముఖ్యమని ఉద్ఘాటించారు. తనకు ప్రభుత్వ ఉద్యోగులు ఎంత ముఖ్యమో.. నెల నెలా పెన్షన్లు తీసుకుంటున్న అవ్వాతాతలు కూడా అంతే ముఖ్యమన్నారు. వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, లింగ వివక్షలేని సాధికారతలు అంతకన్నా ముఖ్యమని స్పష్టం చేశారు. అందుకే తనమంత్రి మండలిలో, మన ప్రభుత్వం ఇచ్చే నామినేటెడ్ పదవులు, ఆలయ బోర్డులు, ఏఎంసీలు, స్థానిక సంస్థల్లో... ఏదిచూసుకున్నా సామాజిక న్యాయంతో పాటు రాజకీయ న్యాయం కూడా అంతే ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నారు. ఆ పదవుల్లో కనీసం సగం వాటా అక్క చెల్లెమ్మలకు ఇచ్చేలా, సగం వాటా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబ సభ్యులకు ఇచ్చానన్నారు. నాలుగు సంవత్సరాలు గడవకముందే 98.5 శాతం మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చి, అమలు చేసిన తర్వాత ఈ సభలో నాలుగో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామన్నారు. ఎన్నికల మేనిఫెస్టో విషయంలో పార్టీలు చూపాల్సిన నిబద్ధతకు సంబంధించి మనం తీసుకువచ్చిన గొప్ప మార్పు ఇది అన్నారు. రాజకీయాలలో విలువలు, విశ్వసనీత అనే రెండు పదాలకు అర్థం తెలియజేసేలా, ప్రభుత్వంపై నమ్మకం పెరిగేలా, పాలనలో పారదర్శకత తీసుకొచ్చే విధంగా పాలన సాగింది. రాజకీయ వ్యవస్థలో గొప్ప మార్పు తీసుకురాగలిగామన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం 26 జిల్లాలుగా విభజన, సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన 10,778 రైతు భరోసా కేంద్రాలు గ్రామస్థాయిలో విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి సేవలోనూ రైతన్నకు తోడుగా నిలుస్తున్నాయన్నారు. 2019 వరకు రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలు కేవలం 11 మాత్రమే. ఈ 45 నెలల కాలంలో మరో 17 మెడికల్ కాలేజీలు ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య రంగం మీద మనం చూపుతున్న శ్రద్ధకు ఇది చిన్న నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ కేవలం 6 పోర్టులు ఉంటే... మరో 4 పోర్టులు నిర్మిస్తున్నామన్నారు. మరో 9 ఫిషింగ్ హార్బర్లు రాబోతున్నాయన్నారు.

విలేజ్ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ 24 గంటలూ అందుబాటులో ఉండడంతో పాటు దాదాపుగా 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు చేస్తూ...ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేస్తున్నామన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులందరికీ రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల మందికి పెన్షన్ అందజేస్తున్నామన్నారు. పెన్షన్‌ను రూ.2250కు పెంచి ఇప్పటికి రూ.2750కు తీసుకెళ్లామన్నారు. బడ్జెట్‌లో జనవరి నాటికి పెన్షన్‌ను రూ.2,750 నుంచి రూ.3000కు పెంచుతామన్నారు. ఇంటి వద్దకే రేషన్- రోల్ మోడల్‌గా ఏపీ నిలుస్తున్నదన్నారు. నవరత్నాల పథకాలు ప్రజల జీవన ప్రమాణస్థాయి పెంపునకు దోహదపడుతున్నాయని, రైతు భరోసా పథకంతో 52.38 లక్షల మంది రైతులకు ఆర్థికసాయం అందుతుందని సీఎం వివరించారు.

విచారణేది?

(మొదటిపేజీ తరువాయి)



ప్రధాని మోదీ చేసిన అవమానకర వ్యాఖ్యలపై ఏం సమాధానం చెబుతారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిలదీశారు. 'అదానీ అంశంపై ఈడీ డైరెక్టర్‌ను కలిసేందుకు అనుమతివ్వలేదు. అదానీ గ్రూపుకు సంబంధించినది చాలా పెద్ద కుంభకోణం. ఆ గ్రూప్‌లో ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఇతర బ్యాంకుల పెట్టుబడులు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తుల కొనుగోలుకు ప్రభుత్వం ఒక వ్యక్తికి డబ్బు ఇస్తోంది. మామూలు వ్యాపారాలు చేసే వ్యక్తి అనూహ్యంగా రూ.13లక్షల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడు? ఇది ఎలా సాధ్యమైంది? ఆయనకు డబ్బు ఇచ్చేదెవరు? మోదీకి, అదానీకి మధ్య సంబంధం ఏమిటి? వంటి ప్రశ్నలకు సమాధానాల కోసం యత్నిస్తున్న విపక్షాల గళాన్ని పాలక పక్షం అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని ఖర్గే అన్నారు.

నిమ్మకు నీరెత్తినట్లుగా...

వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి అదానీ గ్రూపు పెద్దఎత్తున చేసిన అప్పులను ప్రస్తావిస్తూ అవినీతి, క్రోనియిజం, పరిపాటిగా మారిన చట్టాల ఉల్లంఘన పంథా స్పష్టంగా ఉన్నా అదానీ వ్యవహారంలో దర్యాప్తు చేపట్టేందుకు ఈడీ ముందుకు రాకపోవడం శోచనీయమని విపక్షాల ఎంపీలు వ్యాఖ్యానించారు. నిమ్మకు నీరెత్తిన చందంగా అదానీ వ్యవహారంలో ఈడీ వైఖరి ఉన్నదని విమర్శించారు. అదానీపై విచారణ జరిపించాలని డిమాండ్ చేయడమే కాకుండా దర్యాప్తు సంస్థ వైఖరిపై ఫిర్యాదు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు 16 విపక్షాల ఎంపీలు లేఖ రాశారు. అందులో 'సెబీ, సీబీఐతో పాటు ఈడీని కూడా రాజకీయ అవసరాల కోసం దుర్వినియోగిస్తున్నారు.

తాజా వ్యవహారం (అదానీ)పై సుప్రీంకోర్టు నియమిత కమిషన్ పరిమిత అధికార పరిధి గురించి తెలుసు. ఈడీ అదానీ వ్యవహారంలో విచారణకు ముందుకు రావడంలేదు. అధికారాలను సద్వినియోగించుకోవడంలేదు. ఇది సరైన పద్ధతి కాదని చెప్పడమే మా ఉద్దేశం. పైన పేర్కొన్న ఆరోపణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విపక్ష నేతలమైన మేము మిమ్మల్ని (ఈడీ డైరెక్టర్‌నుద్దేశించి) కోరుతున్నాం. మూడు నెలలుగా అదానీ గ్రూపులో అవకతవకలకు సంబంధించి కీలక ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. ఎంతో నిబద్ధతతో కేసులను విచారిస్తామని చెప్పుకునే ఈ దర్యాప్తు సంస్థ... అదానీ వ్యవహారం కనీసం ప్రాథమిక దర్యాప్తును కూడా ఇంత వరకు చేపట్టలేదు. పర్యవసానంగా మేము ఇలా అధికారిక ఫిర్యాదు చేయక తప్పలేదు. తద్వార ఒత్తిడి పెరిగి మన ప్రజాస్వామ్యానికి, ఆర్థిక వ్యవస్థకు పెద్ద ముప్పుగా పరిణమించే 'బంధం'పై విచారణ చేపడతారని భావిస్తున్నాం' అని ఎంపీలు పేర్కొన్నారు.

ఈ లేఖ గురించి ట్విట్టర్‌లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. '16 ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఉమ్మడిగా అదానీ వ్యవహారంలో విచారణ కోసం ఈడీకి లేఖ రాసినట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఈడీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లే ప్రయత్నం చేయగా మధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారని ఆయన ట్వీట్ చేశారు. కాగా 2021 సెప్టెంబరులో ముంద్రా పోర్టులో మారకద్రవ్యాలు లభించడం వ్యవహారాన్ని కూడా విపక్ష నేతలు ఈడీ దృష్టికి తీసుకెళ్లారు.

ఈడీ విచారణపై 'స్టే' ఇవ్వలేం

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. అయితే ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తామే కానీ అత్యవసరంగా విచారించలేమని ఉన్నత న్యాయస్థానం తెలిపింది. ఈ నెల 24న ఈ పిటిషన్ పై విచారణ చేస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. మరో వైపు ఈ విషయమై స్టే ఉత్తర్వులు ఇచ్చేందుకు కూడా ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈడీ అధికారులు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, కవిత తన పిటిషన్‌లో ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయానికి మహిళను విచారణకు పిలవవచ్చా? అనే అంశాన్ని లేవనెత్తారు. ఒక మహిళను ఈడీ విచారణకు పిలుస్తోందని ఇది పూర్తిగా చట్టానికి విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కవిత తరుపు లాయర్ వివరించారు. ఫోన్ సీజ్ వ్యవహారాన్ని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు కవిత. తమకు ఇచ్చిన నోటీసుల్లో ఇతరులతో కలిపి విచారిస్తామని చెప్పారు కానీ అలా చేయలేదని కవిత పేర్కొన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండానే మొబైల్ ఫోన్లు సీజ్‌చేశారని కోర్టు దృష్టికి కవిత తీసుకెళ్లారు. సీఆర్పీసీ సెక్షన్ 160 ప్రకారం ఓ మహిళను ఆమె ఇంటికి వెళ్లి మాత్రమే విచారించాల్సి ఉన్నా.. ఈడీ కార్యాలయానికి పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై కూడా సుప్రీంకోర్టు విచారించనుంది. దిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఈ నెల 11న కల్వకుంట్ల కవిత దిల్లీలో ఈడీ విచారణకు హాజరయ్యారు. తొమ్మిది గంటల పాటు కవితను ఈడీ అధికారులు ప్రశ్నించారు. 15న మరోసారి విచారణకు రావాలని ఈడీ అధికారులు కోరారు. దీంతో సుప్రీంకోర్టులో కవిత న్యాయ పోరాటానికి దిగారు. ఈడీ విచారణపై స్టే కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ సుప్రీంకోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దిల్లీ లిక్కర్ కుంభకోణంలో సౌత్ గ్రూప్ కీలకంగా వ్యవహరించిందని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేకమార్లు సీబీఐ, ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. కొందరిని అరెస్ట్ చేశారు. ఈ నెల 6వ తేదీన అరుణ్ రామచంద్రపిళ్లైని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈడీ అధికారులకు అరుణ్ రామచంద్రపిళ్లై ఇచ్చిన వాంగ్మూలంలో కవిత పేరు ఉన్నట్టుగా కోర్టుకు సమర్పించిన నివేదికలో ఈడీ అధికారులు పేర్కొన్నారు. దరిమిలా ఈ నెల 8వ తేదీన కవితకు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 9న విచారణకు రావాలని ఆదేశించారు. అయితే ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల నేపథ్యంలో విచారణకు సమయం కావాలని కవిత కోరారు. ఈ నెల 11న కవిత విచారణకు హాజరయ్యారు. మరో వైపు గతంలో ఈడీకి ఇచ్చిన స్టేట్‌మెంట్ ను అరుణ్ రామచంద్రపిళ్లై వెనక్కి తీసుకున్నారు. అరుణ్ రామచంద్రపిళ్లై ఈడీ కస్టడీలోనే ఉన్నారు. కవితకు మాజీ ఆడిటర్ గా ఉన్న బుచ్చిబాబును కూడా ఈడీ అధికారులు కస్టడీలోకి తీసుకోనున్నారు. దీంతో వీరిద్దరితో కలిపి కవితను విచారించే అవకాశం ఉందా అనే చర్చ జరుగుతోంది.

డీఎస్సీ-1998 అభ్యర్థులకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులంతా తమకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనబాట పట్టారు. దీంతో జగన్ ప్రభుత్వం స్పందించింది. 4,534 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపు ఉత్తుర్వులు ఇవ్వాలని కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశించింది. ఈ నియామకాల పట్ల సీఎం జగన్‌కు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ తరపున చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు జనరల్ డీఎస్సీ ఇవ్వలేదు. యేటా 10వేల పోస్టులతో జంబో డీఎస్సీ ఇస్తానన్న హామీ అమలుకు నోచుకోలేదు. ఇలా పెండింగ్‌లో ఉన్న డీఎస్సీ అభ్యర్థులకు పోస్టులు ఇవ్వడంతో ఖాళీలు కుదించుకుపోతున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయుల సర్దుబాటు, ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనంతో ఉపాధ్యాయ పోస్టులు కనుమరుగయ్యాయి. జనరల్ డీఎస్సీకి ఎన్ని ఖాళీలు ఉన్నాయనే దానిపై ప్రభుత్వం స్పష్టం చేయడం లేదు. తక్షణమే జనరల్ డీఎస్సీ ఇచ్చి తమను ఆదుకోవాలని ఉపాధ్యాయ శిక్షణార్థులు కోరుతున్నారు.

లాలూ, రాబ్డీ, మీసాలకు బెయిల్

న్యూదిల్లీ: బీహార్ మాజీ ముఖ్యమంత్రులు లాలూ ప్రసాద్ యాదవ్, రాబ్డీదేవి, వారి కుమార్తె మీసా భారతిలకు బుధవారం దిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు రెగ్యులర్ బెయిలు మంజూరు చేసింది. రైల్వే ఉద్యోగాలు ఇచ్చేందుకు ఉద్యోగార్థుల భూములు రాయించుకున్నారని ఆరోపిస్తూ సీబీఐ దాఖలు చేసిన కేసులో వారికి ఊరట లభించింది. వారితోపాటు ఈ కేసులో ఇతర నిందితులకు కూడా కోర్టు రెగ్యులర్ బెయిలు మంజూరు చేసింది. వీరందరికీ బెయిలు మంజూరు చేసిన స్పెషల్ జడ్జి గీతాంజలి గోయల్ ఇచ్చిన ఆదేశాల్లో... సీబీఐ వీరిని అరెస్ట్ చేయలేదని, ఎటువంటి అరెస్టులు లేకుండానే ఛార్జిషీటు దాఖలు చేశారని పేర్కొన్నారు. నిందితులంతా రూ.50 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, అంతే మొత్తానికి జామీను సమర్పించాలని ఆదేశించారు. తదుపరి విచారణ మార్చి 29న జరుగుతుందని తెలిపారు. లాలూ 2004-09లో రైల్వే మంత్రిగా పనిచేసిన కాలంలో ఈ కుంభకోణం జరిగినట్లు సీబీఐ పేర్కొంది. నియామకాల కోసం భారతీయ రైల్వేలు అనుసరించే విధానాలను, ప్రక్రియలను ఉల్లంఘించి, ఈ నియామకాలు జరిగినట్లు సీబీఐ ఛార్జిషీట్‌లో తెలిపింది. ఉద్యోగార్థులు స్వయంగా తాము కానీ, తమ కుటుంబ సభ్యుల ద్వారా కానీ లాలూ కుటుంబ సభ్యులకు తమ భూములు ఇచ్చారని తెలిపింది.

న్యాయం కోసం అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలు

- ఇచ్చిన హామీని జగన్ నిలబెట్టుకోవాలి: దుర్గాభవాని
- ప్రభుత్వ సాయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ముప్పాళ్ల

విశాలాంధ్ర- విజయవాడ: అగ్రిగోల్డ్ బాధితులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రిలే నిరాహారదీక్షలను తొలిరోజు బుధవారం ఆమె ప్రారంభించారు. విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరానికి అసోసియేషన్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా దుర్గాభవాని మాట్లాడుతూ 9 ఏళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఉద్యమ చరిత్రలో అగ్రిగోల్డ్ బాధితుల పోరాటం నిలిచిపోతుందని, తుది ఫలితం వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని దుర్గాభవానీ స్పష్టంచేశారు. ఈ ఉద్యమానికి మహిళా సమాఖ్య పూర్తి మద్దతిస్తోందన్నారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ డబ్బులు ఉన్నా ఎన్నికల ముందు బాధితులకు చంద్రబాబు ఇవ్వలేదని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా జగన్ పూర్తిగా న్యాయం చేయలేదని విమర్శించారు. అగ్రిగోల్డ్ బాధితులకు చేసిన సాయంపై సీఎం జగన్ శ్వేతపత్రం విడుదల చేయాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. పోరాటం ద్వారా అద్భుత విజయాలు సాధించినప్పటికీ ఇంకా 11 లక్షల మందికి పైగా బాధితులికి రూ.3వేల కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో రూ.3వేల కోట్లు కేటాయించి బాధితుల ప్రాణాలు కాపాడాలని కోరారు. రూ.20 వేలలోపు డిపాజిట్‌లు ఉన్న 906 కోట్లు 10 లక్షల 40వేల మందికి సాధించగలిగామన్నారు. 8 రాష్ట్రాలలో ఉన్న మొత్తం 32 లక్షల మంది బాధితులకు అగ్రిగోల్డ్ చేతుల్లో ఉన్న ఆస్తులమ్మి న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. చనిపోయిన అగ్రిగోల్డ్ బాధితుడికి 10 లక్షలు ఇస్తానన్న జగన్...మోసం చేశారని, గత ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చిందని గుర్తుచేశారు. అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం కొనుగోలు చేసి బాధితులకు ఆ డబ్బు చెల్లించాలని కోరారు. అగ్రిగోల్డ్ బినామీ ఆస్తుల్ని, కొత్తగా పెడుతున్న రియల్ ఎస్టేట్ ఆస్తుల్ని జప్తు చేయాలని డిమాండ్ చేశారు. పరిమిత సంఖ్యలో అనుమతి తీసుకుని దీక్షలు చేస్తామంటే పల్నాడు జిల్లా అధ్యక్షుడిని గృహనిర్బంధం చేశారన్నారు. ఆందోళనలకు అనుమతివ్వకపోవడం దారుణమన్నారు. ఇలాంటి అరెస్టులు జరిగితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమం తీవ్రతరం కాకముందే ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ.. రూ.1.90 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రికి కంపెనీ ఆస్తులమ్మి బాధితులకు చెల్లించడంలో ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. బీవీ చంద్రశేఖర్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి లక్షలాది మంది జీవితాలు నాశనమయ్యాయన్నారు. 17వ తేదీన దాసరి భవన్ వద్ద జరిగే సామూహిక సత్యాగ్రహంలో వేలాదిమంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రజానాట్య మండలి కళాకారులు కాశయ్య అభ్యుదయ గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. మొదటి రోజు ఉమ్మడి కృష్ణాజిల్లా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన బాధితులు దీక్షలో కూర్చున్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్. కోటేశ్వరరావు, విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ సంఘీభావం తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఈవీ నాయుడు, మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వై.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బాధితులు జగన్మోహనరావు, నాగలక్ష్మీ, బుల్లి వీరయ్య, కనకదుర్గమ్మ, శేఖర్, సత్యనారాయణ, గోపాలకృష్ణ, సూర్యనారాయణ, సంతోశ్ దీక్షలో కూర్చున్నారు.

తలెత్తుకోలేక పోతున్నాం

నేను నాలుగు కోట్ల రూపాయల డిపాజిట్లు కట్టించాను. పది, ఇరవై వేలు కట్టిన వారు పెద్దగా పట్టించుకోవటం లేదు. పెద్దమొత్తంలో కట్టిన వారు ఇంటికి తాళాలు వేస్తున్నారు. వారిని సముదాయించటం చాలా కష్టంగా ఉంది. కస్టమర్లు అందరూ బంధువులు, స్నేహితులు కావటంతో వారి ముందుకు వెళ్లటానికి ముఖం చెల్లటం లేదు. సంబంధ బాంధవ్యాలు దెబ్బతింటున్నాయి. శుభ కార్యాలకు వెళ్లటం మానేశాం.

– చక్క జగన్మోహనరావు, కలిదిండి

ఇల్లు అమ్ముకున్నాను

నా కస్టమర్లు 10 మంది చనిపోయారు. దాంతో ఏమిచేయలో తోచక ఉంటున్న ఇల్లు అమ్మి బాగా కష్టంలో ఉన్నవారికి కొంత ఇచ్చాను. పిల్లలను చదివించలేకపోయాను. నేను, పిల్లలు గుమస్తాగా పనిచేస్తున్నాం. కొంతమంది ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ ఇబ్బందులు పెడుతున్నారు. ఇంకా ఎందుకు బతికి ఉన్నామనే బాధ వేస్తుంది. నేను రూ.50 కోట్లు డిపాజిట్ కట్టించాను. నా సొంత డబ్బులు 12 లక్షల రూపాయలు రావాల్సి ఉంది.

– కె.గోపాలకృష్ణ, భీమవరం

అల్లుడు సాధిస్తున్నాడు

నేను మా అమ్మాయి పేరుతో 4 లక్షల రూపాయలు కట్టాను. ఏజెంట్‌గా కస్టమర్ల వద్ద నుంచి 6 లక్షలు డిపాజిట్లు కట్టించాను. మా అమ్మాయికి పెద్దమొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పి అగ్రిగోల్డ్ బాండ్లు ఇచ్చి పెళ్లి చేశాం. ఇప్పుడు డబ్బులు రాకపోయేసరికి అల్లుడు మమ్మల్ని, అమ్మాయిని వేధిస్తున్నాడు. మా బంధువుల నుంచి ఛీత్కారాలు ఎదురవుతున్నాయి.

– కత్తుల దుర్గమ్మ, కొమరవరం

భార్యకు వైద్యం చేయించలేకపోతున్నా

నేను ఆర్థికంగా బాగా చితికిపోయాను. అనారోగ్యంతో బాధపడుతున్న భార్యకు వైద్యం చేయించలేని దుస్థితిలో ఉన్నాను. నా కస్టమర్ జి.పద్మ తనకున్న రెండు ఎకరాల భూమి అమ్మి 7 లక్షల రూపాయలు డిపాజిట్ చేసింది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. వారి పరిస్థితి చూసి బాధేస్తుంది. పిల్లల భవష్యత్‌పై ఎంతో ఆశ పెట్టుకుంటే సర్వనాశనమైంది.

– జె.శివశంకర్, మల్లేశ్వరం

20న 'చలో పార్లమెంట్'కు తరలిరండి

కేవీవీ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం నిర్వహించిన ఉద్యమం విరమణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీలు అమలు కోసం ఈనెల 20న తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమానికి తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ రైతాంగానికి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చలో పార్లమెంట్ నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందని, ఈ మేరకు రైతులు ఢిల్లీలో జరిగే ర్యాలీ మరియు సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తెస్తామని, రైతులతో మాట్లాడిన తర్వాతే విద్యుత్ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెడతామని, రైతులు రుణమాఫీ గురించి ఆలోచిస్తామని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తెస్తామని, ఉద్యమంలో మరణించిన రైతుకుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లిస్తామని, ఉద్యమ కాలంలో రైతులపై అక్రమ కేసులు ఎత్తి వేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అచరణలో విస్మరించి రైతాంగాన్ని మోసగించిందన్నారు. ఇచ్చిన హామీల అమలుతోపాటు మోదీ మోసపూరిత వైఖరికి నిరసనగా రైతాంగం మరో సారి ఉద్యమించాలన్న సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయంలో భాగంగా 20న ఢిల్లీలో జరిగే ప్రదర్శన , బహిరంగ సభలో రాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో రైతాంగం పాల్గొనేలా కృషి జరుగుతోందని, చలో పార్లమెంట్ విజయవంతం చేయాలని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

ఆచార్య ఎస్వీ సత్యనారాయణకు డి.లిట్.

విశాలాంధ్ర-విజయవాడ: పొట్టిశ్రీ రాములు.తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, ఉస్మా నియా ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రధానాచార్యుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (డి.లిట్) పట్టా పొందారు. 'ఆధునిక తెలుగు సాహిత్య ధోరణులు' అంశంపై సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి మద్రాస్ విశ్వవిద్యాలయం ఆయనకు డి.లిట్ అందజేసింది. ఈ మేరకు మద్రాస్ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్ర ణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కవిగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, వక్తగా, ఉత్తమ అధ్యాపకుడిగా, పరిపాలనా దక్షుడిగా బహుముఖీనమైన కృషిని కొనసాగిస్తున్న ఆచార్య సత్యనారాయణ 28 స్వీయ గ్రంథాలను ప్రకటించారు. మరో 34 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. ఆయన పర్యవేక్షణలో 15 పీహెచ్‌డీ పరిశోధనలు, మూడు ఎంఫిల్ పరిశోధనలు జరిగాయి. 34 ఏళ్ల బోధనానుభవంలో మూడు యూజీసీ మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టులు, మరో మూడు మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తిచేశాడు. 2017లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహక కమిటీ (కోర్ కమిటీ) సభ్యుడిగా ఈయన వ్యవహరించారు. 2018లో ఏపీ ప్రభుత్వం శాసనసభలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'పాఠశాల స్థాయిలో తప్పనిసరి తెలుగు' చట్టం రూపకల్పన కమిటీకి చైర్మన్‌గా, పాఠశాలల్లో చట్టం అమలు పర్యవేక్షక కమిటీకి చైర్మన్ గానూ వ్యవహ రించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్న సత్యనారాయణ ముప్పైకిపైగా పురస్కారాలను పొందారు. రష్యా, నేపాల్, ఆస్ట్రేలియా, ఈజిప్టు, మలేసియా, మారిషస్, సింగపూర్, అమెరికా, న్యూజిలాండ్ దేశాలలో తెలుగు సాహిత్యంపై ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని, అధికార భాషా సంఘం వారి భాషా పురస్కారాన్ని, శ్రీశ్రీ స్వర్ణపతకాన్ని, ముఖం జాతీయ పురస్కారాన్ని పొందారు. ఇటీవల కేంద్రసాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు.

రేపు విజయవాడలో స్కీం వర్కర్ల సామూహిక ధర్నా

కార్మికలోకం తరలిరావాలని ఏఐటీయూసీ పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రంలో వివిధ స్కీంలలో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 17వ తేదీన విజయవాడలో నిర్వహించే సామూహిక ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ తదితర కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వలేదని, పని భద్రత లేదని, పని భారం పెరిగిందని, వీరిపై అధికారులు రాజకీయ నాయకుల వేధింపులు ఎక్కువ అయ్యాయని విమర్శించారు. చేసిన పనికి కూడా సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని సంవత్సరాల తరబడి టీఏ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే వివిధ సందర్భాల్లో స్థానికంగా ఆయా కార్యాలయాల వద్ద నిరసనలు తెలియజేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కార్మికుల సమస్యలపై చర్చించి, పరిష్కారం చూపాలని కోరుతూ ఈనెల 17వ తేదీన అన్ని రంగాల కార్మికులు విజయవాడలో జరిగే సామూహిక ధర్నాలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని భావిస్తున్నామని దీనికి కార్మిక లోకం తరలి రావాలని కోరారు. కాగా జగనన్న గోరుముద్ద మెస్ చార్జీలు, కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న జరిగే సామూహిక ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు పిలుపునిచ్చారు. అదే రోజు విజయవాడలో జరిగే ఆశా వర్కర్ల ధర్నాను విజయవంతం చేయాలని శ్రామిక మహిళా ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి కళ్లేపల్లి శైలజ కోరారు.

చల్లా, బచ్చులకు శాసనమండలి సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీలు చల్లా భగీరథరెడ్డి (వైసీపీ), బచ్చుల అర్జునుడు (టీడీపీ) అకాలంగా మరణించగా రాష్ట్ర శాసనమండలి బుధవారం వారి మృతికి సంతాపం తెలిపింది. ఉదయం 10గంటలకు ఆర్థికశాఖ మంత్రి సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. చల్లా భగీరథరెడ్డి, బచ్చుల అర్జునుడు సేవలను సభ్యులు కొనియాడారు. సౌమ్యులు, స్నేహశీలురు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నాయకులు, వాటి పరిష్కారం కోసం విశేష కృషి చేశారని ప్రశంసించారు. మృతుల కుటుంబాలకు మనోధైర్యం ప్రసాదించాలని కోరుతూ సభ్యులు జంగా కృష్ణమూర్తి, పీవీఎస్ రాజు, ఎన్ఎండీ ఫారూఖ్, యనమల రామకృష్ణుడు, లక్ష్మణరావు, జకియా ఖానూమ్, డొక్కా మాణిక్య వరప్రసాద్, మహమ్మద్ ఇక్బాల్, అశోక్‌బాబు, కేఈ ప్రభాకర్, వాకాటి నారాయణరెడ్డి, రమేష్ యాదవ్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బి.తిరుమల నాయుడు, అంగర రామ్మోహన రావు, పోతుల సునీత, దువ్వారపు రామారావు, శ్రీనివాసరెడ్డి, శివానంద రెడ్డి, చిక్కాల రామచంద్రరావు తమ తమ సంతాప ప్రకటనలు చేశారు. చివరగా చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ ఇద్దరు సభ్యులను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. వారికి సంతాపసూచికంగా రెండు నిమిషాలు సభ మౌనం పాటించింది. ప్రస్తుత సమావేశానికి ప్యానెల్ చైర్మన్లుగా పోతులసునీత, కళ్యాణ చక్రవర్తి, తూమాటి మాధవరావు, మంతెన సత్యనారాయణరాజు ఉన్నారు. సభను గురువారానికి చైర్మన్ వాయిదా వేశారు.

శ్రీశైలం వెళ్లే కన్నడ భక్తులకు ఉచిత సేవలు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్లే కన్నడ భక్తులకు కర్నూలు జిల్లాలో మంచి ఆదరణ లభిస్తోంది. వేలాది మంది పాదయాత్రగా శ్రీశైలం చేసుకొని తమ ఇంటి ఆడపడుచుగా భావించే భ్రమరాంబదేవికి ఉగాది రోజుకు పసుపుకుంకుమ సమర్పించడం ఆనవాయితీ. ఏటా నల్లమల అడవుల గుండా భక్తులు కాలినడకన శ్రీశైలం వస్తారు. కొందరు కాళ్లకు కర్రలు కట్టుకొని నడుస్తారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, ఉదయం, రాత్రి వేళల్లో అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించడమే కాకుండా వారి కోసం ఉచిత వైద్య శిబిరాలను జిల్లాలో నిర్వహిస్తున్నారు. కర్నూలు పట్టణంలో కేసీ కెనాల్, సెంట్రల్ ప్లాజా వద్ద భక్తులకు ఉదయం, మధ్యాహ్నం పూట ఉచితంగా భోజనం అందచేశారు. కోసిగి నుంచి శ్రీశైలం వరకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రజలు చూస్తున్నారు.

'ఆవిర్భావ సభ' మార్పుకు నాంది!

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర-మంగళగిరి: బెజవాడ కృష్ణమ్మ జన సునామీతో ఉప్పొంగిందా? బందరు సముద్ర తీరం ముందుకు వచ్చిందా అన్నట్లు విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఇంత జనమా? అనే ఆశ్చర్యం కలిగే రీతిలో జనసేన 10వ ఆవిర్భావ సభ విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తరపున, పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన 10వ ఆవిర్భావ సభ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా బుధవారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మనోహర్ పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'వారాహి' వాహనంపైకి పవన్ కల్యాణ్ ఎక్కి ప్రజలకు అభివాదం చేసిన దగ్గర నుంచి సభాస్థలికి వెళ్లే వరకు లక్షలాదిమంది జనసైనికులు, ప్రజలు ఆయనకు పలికిన స్వాగతం అపూర్వమైనదన్నారు. బెజవాడ చరిత్రలో గతంలో ఎన్నడూ జరగలేనంతగా రోడ్డు షో విజయవంతం అయ్యిందన్నారు. ఇది రాష్ట్ర రాజకీయాల్లో ఓ గొప్ప మార్పునకు నాందిగా భావిస్తున్నామన్నారు. ముఖ్యంగా అంతమంది మహిళలు ఒక రాజకీయ పార్టీ సభకు రావడమే గొప్ప విషయం అయితే, సభ చివరి వరకు ఉండి పవన్ కల్యాణ్ ప్రసంగాన్ని వినడం మరింత గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమం విజయవంతానికి పూర్తి సమన్వయంతో, ఐక్యమత్యంగా పనిచేసిన ప్రతిఒక్కరికి మనోహర్ హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆవిర్భావ సభకు అత్యంత అద్భుతంగా ఏర్పాట్లు చేసిన పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సినీ రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర

విశాలాంధ్ర- తెనాలి: సినీ రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర అని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. బుధవారం తెనాలి పెమ్మసాని థియేటర్లో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడారు. సభకు మాజీ శాసనసభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ... తనకు జన్మనిచ్చి, అభిమానుల మనస్సుల్లో చోటు కల్పించిన తన తండ్రి నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలకు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఎన్టీఆర్ ఎవరి రుణాన్ని ఉంచుకోలేదని తనను ఆదరించిన ప్రజల కోసం తన వంతుగా సేవలు చేశారన్నారు. చెన్నైకి తెలుగుగంగ ద్వారా నీరు అందించారని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌తో పాటు నటించిన వారందరూ చిరస్మణీయులేనని గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల రోజే పాతాళభైరవి సినిమా విడుదలైన రోజు కావడం మరో విశేషం అని చెప్పారు. తన తండ్రి కులమతాలకు అతీతంగా పనిచేశారని, తాను కూడా అదే బాటలో పయనిస్తున్నానని చెప్పారు. మహానటి సావిత్రి అవార్డును ఆమె కుమార్తె విజయ చాముండేశ్వరికి బాలకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. అదే రీతిలో నిర్మాత బి.నాగిరెడ్డి కుమారుడికి అవార్డును అందజేశారు. అధ్యక్షత వహించిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సినీరంగంలో విశిష్ఠ నటుడు, దర్శకుడు, నిర్మాతగా దేశప్రజల హృదయాలలో ఎన్టీఆర్ నిలిచిపోయారన్నారు. నేటికి ఎన్టీరామారావు చిత్రాలకు విశేషంగా హాజరవుతున్నారని, దానికి నిదర్శనం ఈ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రదర్శిస్తున్న సినిమాలేనని తెలిపారు.

అసెంబ్లీకి వస్తే పవన్‌కు పాసులిస్తాం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏదోరకంగా పవన్ కల్యాణ్ అసెంబ్లీకి వస్తానని చెబుతున్నారని, అసెంబ్లీకి రావాలంటే ఎన్నికల వరకు ఆగాల్సిన అవసరం లేదని, కావాలంటే అసెంబ్లీ విజిటింగ్ పాసులు ఇస్తామని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఏపీ సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మచిలీపట్నం సభలో పవన్‌కల్యాణ్ ప్రసం గంలో కొత్తదనమేమీ లేదనిన్నారు. రాజకీయపార్టీ పెట్టి గంపగుత్తగా దానిని మరో రాజకీయ పార్టీకి అమ్మేయడమే లక్ష్యంగా పవన్ కల్యాణ్‌లో పనిచేస్తున్నట్లు కన్పించిందన్నారు. కులాలతో సంబంధం లేదని చెబుతూనే...కాపులంతా చంద్రబాబు సామాజికవర్గానికి అమ్ముడుపోవ దానికి సిద్ధంగా ఉండాలనేది పవన్ ఉద్దేశంగా విన్పించిందన్నారు. కొన్నిచోట్ల జనసేన పోటీచేసినా...ఓట్లు మాత్రం టీడీపీకి వేసి చంద్రబాబుపై ఉన్న ప్రేమ, మమకారం చాటుకోవాలని పవన్ తన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారన్నారు. జెండా జనసేనది...అజెండా టీడీపీదని మంత్రి అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. పదేళ్లలో జనసేన పార్టీ ప్రస్థానం చూస్తే...2014లో ఒకరితో పొత్తు...2019లో మరికరితో పొత్తు....ఆ పార్టీతో ఉంటే ఈ పార్టీని తిట్టడం... ఈ పార్టీతో ఉంటే ఆ పార్టీని తిట్టడం... దీనిని అందరూ గమనించారని చెప్పారు. కుల ప్రస్తావన లేని రాజకీయ పార్టీ పెట్టానని ఓ పక్క గొప్పగా చెప్పుకుంటున్న పవన్ కల్యాణ్...మరోపక్క కులాల గురించి తప్ప మరేమీ మాట్లాడటం లేదని ఆరోపించారు. కాపుకులాన్ని మూటగట్టి టీడీపీకి, చంద్రబాబుకు తాకట్టు పెట్టాలన్న పవన్ ఉద్దేశం బహిర్గతమైందన్నారు. 'మేం ఇప్పటికే అనేక సందర్భాల్లో చంద్రబాబుకు పవన్ దత్తపుత్రుడని చెబుతున్నాం. మచిలీపట్నం సభలో మరోసారి దానిని పవన్ రుజువు చేశారు' అని వ్యాఖ్యానిం చారు. 175 చోట్ల పోటీచేసే దమ్ములేని నేత పవన్ అని దుయ్యబట్టారు. పవన్‌ను నమ్మితే కార్యకర్తలంతా మునిగినట్టేనని సూచించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో రాష్ట్రంలోని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల హడావుడీ కనిపించింది. పరీక్షలకు వెళ్లే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను నడిపింది. ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులంతా ప్రత్యేక బస్సుల్లో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం ప్రాథమిక చికిత్సా కేంద్రాలు, తాగునీటి సౌకర్యాల్ని కల్పించారు. ఏపీఈఏపీసెట్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ పరీక్షలకు వెయిటేజీ ఇవ్వడంతో తాజా పరీక్షలకు ప్రాధాన్యత ఏర్పడింది. కాగా, ఈనెల 16వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు మొదలవుతాయి.

రచయిత్రి అనురాధకు బీహెచ్‌యూ సత్కారం

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రముఖ రచయిత్రి యలమర్తి అనూరాధను బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) తెలుగు శాఖ దుశాలువాతో సన్మానించింది. సాహిత్యంలో చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ తెలుగు శాఖ అధ్యక్షులు, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు ఆమెను తమ కార్యాలయంలో సన్మానించారు. భాషాశాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యులు డా. గట్ల ప్రవీణ్, భారతీయ భాషల విభాగం, సహాయ ఆచార్యులు డా.టి.జగదీశన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పవిత్రస్థలమైన కాశీలో తనకు సన్మానం జరగడం మరువలేనిదని అనురాధ తన ఆనందాన్ని వ్యక్తంచేశారు.

అన్ని కులాలు చంద్రబాబుకు ఊడిగం చేయాలా?

పవన్‌ను ప్రశ్నించిన మాజీ మంత్రి పేర్ని నాని



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కులాలపై దుర్మార్గమైన రాజకీయ క్రీడను కట్టిపెట్టాలని, అన్ని కులాలు చంద్రబాబుకు ఊడిగం చేయాలా అని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మాజీ మంత్రి పేర్ని వెంకట్రా మయ్య (నాని) ప్రశ్నించారు. ఏపీ సచివాలయం మీడియా పాయింట్ దగ్గర బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాపులను రెచ్చగొట్టి..వారిలో భావోద్వేగాలు కలిగించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తు న్నారని ధ్వజమెత్తారు. వంగవీటి మోహనరంగాను కాపులు అభిమానిస్తు న్నారనే అసూయ పవన్‌లో కన్పిస్తోందని ఆరోపించారు. బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలన్న తన ఆకాంక్షను పవన్ మర్మగర్భంగా వెల్లడించారని చెప్పారు. అదేసమయంలో బీజేపీతో దోస్తీని వదులుకోవడానికీ భయపడుతున్నారన్నారు. మోదీ, అమిత్ షా, నడ్డా అంతా మంచోళ్లే కానీ..ఇక్కడి వారు మాత్రం సన్నాసులని పవన్ అంటున్నారని నాని చెప్పారు. పవన్ కల్యాణ్ చంద్రబాబును కాపాడదలు చుకున్నారని, అందుకే అందరూ తనకు ఓటేయాలని అడుక్కుంటున్నారని తెలిపారు. పవన్‌ను నమ్మితే ఏమి జరుగుతుందో కాపులందరికీ తెలుసని, మెజార్టీ కాపులు జగన్‌తోనే ఉన్నారని స్పష్టంచేశారు. ముసుగులు తీసి చంద్రబాబు, పవన్ చెట్టాపట్టాలు వేసుకుని జగన్‌పై పోరాటానికి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ప్రతి ఐదు, పది సెకన్లకోసారి కులం పేరు తీస్తూ ఈయన కులరహిత సమాజాన్ని నిర్మిస్తాడా అని ప్రశ్నించారు. పార్టీలు పెడతారు..మూసేస్తారు అంటూ సినీ జీవితాన్నిచ్చిన చిరంజీవినీ పవన్ అవమానించారని ధ్వజమెత్తారు. ఎవరైనా ఆవిర్భావ సభ, ప్లీనరీలు పెట్టుకుంటే ఇప్పటి వరకు ఏమి చేశాం...భవిష్యత్‌లో ఏమి చేస్తాం అనే దానిపై చర్చిస్తారని, పవన్ మాత్రం సొల్లు కబుర్లు, కుల రాజకీయాలు, పొత్తుల గురించే మాట్లాడతారని విమర్శించారు. చంద్రబాబుకు వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించే సత్తా లేకనే పవన్‌తో మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు.

చంద్రబోస్‌కు అప్తా అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రౌద్రం... రణం... రుధిరం (ఆర్‌ఆర్‌ఆర్)లోని 'నాటు నాటు' పాటకు ఉత్తమ ఒరిజనల్ పాటల విభాగంలో ఆస్కార్ లభించడం శుభ సందర్భమని అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (అప్తా) అధ్యక్షులు ఉదయ్ భాస్కర్ కొట్టె తెలిపారు. గీత రచయిత చంద్రబోస్, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో పాటు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న చంద్రబోస్ అట్లాంటాకు వెళ్లగా అక్కడ ఉదయ్‌భాస్కర్ అధ్వర్యంలో అప్తా సభ్యులు ఘనంగా సత్కరించారు. తెలుగు ప్రజలే కాకుండా ప్రతి భారతీయుడు కల నెరవేరిందన్నారు. భవిష్యత్తులో తెలుగుతనంతో చంద్రబోస్ కలం నుంచి మరెన్నో ఆణిముత్యాలు, అక్షర తూణీరాలు విరజిల్లాలని ఆకాంక్షించారు. సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు అట్లాంటాలో కన్నులపండుగగా జరగనున్న అప్తా 15 వసంతాల సదస్సుకు రావాలని చంద్రబోస్‌ను ఆహ్వానించారు.

సంపాదకీయం

ప్రతిపక్షానికి వీధిలోనూ అడ్డంకే

ప్రతిపక్షం గొంతు నొక్కడానికి మోదీ సర్కారు ఏ అవకాశాన్నీ వదిలిపెట్టడంలేదు. అదానీ లోగుట్టు హిండెన్ బర్గ్ సంస్థ బయట పెట్టింది. దీనితో దేశంలో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఇప్పటికీ తేరుకుంటున్న ఆనవాళ్లు లేవు. అదానీ సంపద లక్షలాది కోట్లు గాలిలో కలిసి పోయింది. హిండెన్ బర్గ్ బయట పెట్టిన నివేదిక దురుద్దేశంతో కూడుకున్నదని, నిరాధారమైందనీ ఇది దేశంపైనే దాడి అనేంత దాకా అదానీ వెళ్లాడు. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేయడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జె.పి.సి.) ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టినా మోదీ సర్కారు అంగీకరించలేదు. ప్రతిపక్ష నేతల మీద మాత్రం సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ విరుచుకు పడుతున్నాయి. అదానీ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని కోరడానికి బుధవారం 16 ప్రతిపక్ష పార్టీలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కు విన్నవించాలనుకున్నాయి. ప్రతిపక్షాలకు చెందిన దాదాపు 200 మంది నాయకులు పార్లమెంటు నుంచి ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ కార్యాలయానికి వెళు తుండగా పోలీసులు రోడ్డుమీద అడ్డంకులు ఏర్పాటుచేసి ప్రతిపక్ష నాయకులను ముందుకు వెళ్లనివ్వలేదు. అంటే జె.పి.సి. ఏర్పాటు చేయాలని పార్లమెంటులో మొరపెట్టుకున్నా వినే నాథుడు కనిపించలేదు. కనీసం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్‌ను కలిసి అదానీ వ్యవహారం నివేదించాలనుకున్నా ప్రభుత్వం అడ్డంకులు కల్పించక మానలేదు. అంటే ప్రతిపక్షం మాట పార్లమెంటులోనూ వినిపించకూడదు, వీధుల్లోనూ చెల్లకూడదు అన్నదే మోదీ సర్కారు లక్ష్యంగాఉంది.

ప్రతిపక్ష నాయకులు ముందుకు సాగకుండా దిల్లీ పోలీసులు రోడ్డుమీద భారీస్థాయిలో అడ్డంకులు ఏర్పాటుచేశారు. ఉమ్మడిగా వెళ్తున్న ప్రతిపక్ష నాయకులను నిరోధించడానికి దిల్లీ పోలీసు విభాగం రెండువేలమంది పోలీసులను రంగంలోకి దించింది. దీనితో ప్రతిపక్ష నేతలు తమ సంకల్పాన్ని విరమించవలసి వచ్చింది. ఈ విషయమై ఉమ్మడిగా ఫిర్యాదు చేస్తామని ఈ నాయకులు తెలియజేశారు. ఇది ప్రతిపక్షం గొంతు నొక్కడంలో భాగమే. నోరు మెదిపితే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే మోదీ సర్కారు, బీజేపీ నాయకులు ఇతరుల ప్రజాస్వామ్య హక్కులను మాత్రం ఖాతరు చేసే దాఖలాలే లేవు. అయితే కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), జె.డి.యు, శివసేన ఉద్ధవ్ వర్గం, లాలూ నాయకత్వంలోని ఆర్.జె.డి, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డి.ఎం.కె., జార్ఖండ్ ముక్తీ మోర్చా, ఆమ్ ఆద్మీ పార్టీ, ఐ.యు.ఎం.ఎల్., వి.సి.కె., కేరళ కాంగ్రెస్‌తో పాటు మరికొన్ని ప్రతిపక్షాల నాయకులు కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో కలిసి ఏ విషయంపైనైనా అడుగు ముందుకు వేయడానికి మొన్నటి దాకా ముందుకు రాని ఆమ్ ఆద్మీ పార్టీ కూడా బుధవారం నాటి ప్రదర్శనలో కలిసి రావడం సానుకూల పరిణామమే అనుకోవాలి. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన నాయకుడు సత్యేంద్ర జైన్ కొన్ని నెలలుగా జైలులో ఉండడం, ఇటీవల దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను అరెస్టు చేయడం ఆమ్ ఆద్మీ పార్టీ ఇతర ప్రతిపక్షాలతో కలిసి పనిచేయడానికి ప్రధాన కారణం అయి ఉండవచ్చు. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రతిపక్షాల ప్రదర్శనలో చేరలేదు. విచిత్రం ఏమిటంటే శరద్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి.) కూడా ప్రతిపక్షాలతో కనిపించక పోవడం గమనార్హం. తృణమూల్ కాంగ్రెస్, కె.సి.ఆర్. నేతృత్వంలోని భారత రాష్ట్రసమితి లాంటివి ఎటూ ఇతర ప్రతిపక్షాలతో కలిసి పనిచేయడం లేదు. చాలా ప్రాంతీయ పార్టీలు ఇదే ఒంటెత్తు పోకడ అవలంబిస్తున్నాయి. పేరుకు మాత్రం తాము మోదీ నాయకత్వంలోని బీజేపీకి వ్యతిరేకులం అని ప్రచారం చేసుకుంటాయి. ఉమ్మడి కార్యాచరణ దగ్గరికి వచ్చేసరికి కాళ్లీడుస్తాయి.

అదానీ కుంభకోణం నేపథ్యంలో స్టాక్‌మార్కెట్ కుప్పకూలిన అంశంపై సమగ్ర దర్యాప్తు చేయడం కోసం సుప్రీంకోర్టు ఆరుగురు నిపుణులతో కమిటీ ఏర్పాటుచేసింది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టే వారికి మరింత అవగాహన కల్పించడం, నియంత్రణా వ్యవస్థలను బలోపేతం చేయడానికి తీసుకోవలసిన చర్యలను సూచించడం ఈ కమిటీ బాధ్యత. ఇలాంటి కమిటీ ఏర్పాటు చేయడానికి మోదీ ప్రభుత్వం సిద్ధమైనా సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఇది చిన్నపాటి సానుకూలాంశం మాత్రమే. అదానీ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని సుప్రీంకోర్టు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌చేంజ్ బోర్డును (సెబీ)కూడా ఆదేశించింది. నిజానికి సెబీ ఆ పని చేయనందువల్లే అదానీ కుంభకోణానికి అవకాశం వచ్చింది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలను ఉల్లంఘించి స్టాక్ మార్కెట్ లో ఏవైనా అవతవకలు జరిగాయేమో పరిశీలించే బాధ్యతకూడా సుప్రీంకోర్టు సెబీకి అప్పగించింది. ఈ దర్యాప్తులవల్ల నిర్ణీత కాలంలో ఈ వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది అని గౌతం అదానీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆహ్వానించారు. ఇటీవలి కాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ప్రతిపక్ష నాయకుల మీద కత్తిగట్టినట్టు ప్రవర్తిస్తోందని ప్రతిపక్ష నాయకులు అంటున్నారు. ఇది కేవలం ఆరోపణ కాదని జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే అర్థం అవుతుంది.

నిష్పక్షపాతంగా వ్యవహరించవలసిన ఈ కేంద్ర దర్యాప్తు సంస్థ పూర్తి పక్షపాతదృష్టితో దాడులకు పాల్పడుతోంది. సుప్రీంకోర్టు ఆరుగురితో దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేయడంకూడా పరిమితమైన ప్రయోజనాలనే నెరవేరుస్తుంది. ఇలాంటి పరిస్థితిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్‌కు మొత్తం పరిస్థితిని వివరించడానికి ప్రతిపక్ష నాయకులు ప్రయత్నించారు. ఆ విభాగం డైరెక్టర్‌ను కలవడానికి అనుమతి కూడా తీసుకున్నారు. కానీ మోదీ సర్కారు ఆ అవకాశం కూడా దక్కనివ్వ లేదు. అదానీ వ్యాపార సామ్రాజ్యం మీద వచ్చిన ఆరోపణలను దర్యాప్తు చేయడానికి జె.పి.సి. ఏర్పాటు చేయాల్సిందేనని ప్రతిపక్షాలు ఇప్పటికీ పట్టుబడ్తూనే ఉన్నాయి. జె.పి.సి. ఎవరినీ శిక్షించలేదు కానీ ఎవరినైనా పిలిపించి విచారించే అవకాశం ఉంటుంది. గతంలో ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు జె.పి.సి. ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ మోదీ ప్రభుత్వం మాత్రం ఈ ప్రతిపాదనను నిరాకరిస్తూ తన మంకుపట్టు కొనసాగిస్తూనే ఉంది. అదానీని కాపాడడానికి తన చేతిలో ఉన్న సకల ఆయుధాలను మోదీ సర్కారు ఉపయోగిస్తూనే ఉంది. ప్రతిపక్షాల మాట పెడచెవిన పెట్టడం ద్వారా ప్రజాస్వామ్య విధానాలకు తిలోదకాలిస్తోంది. ఇదే మోదీ మార్కు ప్రజాస్వామ్యం. మచ్చుకైనా ఎదుటి పక్షం వాదనను వినే అలవాటు మోదీ సర్కారుకు లేదు. గతంలో వెలికి వచ్చిన 2జి, కామన్వెల్త్, బోఫోర్స్, కేతన్ పారేఖ్, బొగ్గు నిల్వల కేటాయింపు కుంభ కోణాలలో ఇమిడి ఉన్న మొత్తం కన్నా అదానీ కుంభకోణంలో ఇమిడి ఉన్న మొత్తం అనేక రెట్లు ఎక్కువ. అయినా వినిపించుకునే తత్వం మోదీ సర్కారుకు లేదు.

ఆందోళనబాటలో గ్రామీణ తపాల ఉద్యోగులు

ప్రపంచంలోనే అత్యధిక సమాచార వ్యవస్థ కలిగినది "ఇండియా పోస్ట్"ఇది భారత సమాచార మంత్రిత్వశాఖ క్రింద పనిచేస్తుంది. స్వాతంత్ర్యం రాకముందు గ్రామీణప్రజలకు సమాచారం చేర వేసేందుకు ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో వారెన్ హేస్టింగ్ చొరవ తీసుకొని మొదట్లో కంపెనీ మెయిల్ పేరుతో మొదటి పోస్ట్ఆఫీస్ 1727 సంవత్సరంలో స్థాపించారు. 1774లో కలకత్తా నగరంలో మొదటి పోస్ట్ ఆఫీస్ ప్రారంభించారు. భారత దేశంలో మొత్తం 1,54960 పోస్ట్ ఆఫీసులు, 23 సర్కిల్స్‌లో 4,16,83,000 మంది ఉద్యోగులు ఉన్నారు. గ్రామాల్లో గ్రామీణ దాక్‌సేవ ఉద్యోగులు దాదాపు 2,37,400 మంది అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారు. ఇందులో బ్రాంచ్ పోస్‌మాస్టర్, ప్యాకర్స్, మెయిలర్, కొరియర్ లాంటి ఉద్యోగులు ఉన్నారు. వీరి పనిగంటలు పల్లెటూరులో రెండు నుంచి నాలుగు గంటలు మాత్రమేనని నిర్ణయించినప్పటికి రోజుకు దాదాపు 8 గంటలు పనిచేసినప్పటికీ వీరికి కేవలం 4గంటలవేతనం మాత్రమే లభిస్తుంది. గ్రామీణ తపాల ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగుల మాదిరి అనేక వసతులులేవు. వాస్తవంగా వీరు కేవలం ఉత్తరాలు, మనీఆర్డర్స్, పార్సిల్స్ ప్రజలకు అందజేస్తూ ప్రజల్లో కుటుంబసభ్యునిగా చదువురాని వారికి ఉత్తరాలురాయడం, చదవడంచేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. తపాలశాఖ అనేది ప్రజలకు సేవ అందించే సంస్థ మాత్రమే. కానీ నేడు ప్రైవేట్ కొరియర్ వ్యవస్థ నుంచి పోటీ తట్టుకోలేక సేవింగ్స్, బీమా రంగాల్లో ప్రవేశించి వ్యాపార, వాణిజ్య సంస్థగామారి గ్రామీణ తపాల ఉద్యోగులకు పనిభారం పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులకు, రైతులకు, వికలాంగులకు చెల్లించే పెన్షన్లు కూడా వీరే చెల్లిస్తున్నారు. పోస్ట్ ఆఫీసుల్లో కంప్యూటర్ ద్వారా లావాదేవీలు నిర్వహించాలంటే పల్లెటూర్లలో ఇంటర్‌నెట్ సౌకర్యం సరిగా పని చేయక, ఉద్యోగులకు సాంకేతిక పరిజ్ఞానంలేక నగదు చెల్లించే పిఓటి యంత్రాలు సిగ్నల్స్ లేకపోవడంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు నిత్యం బాధ పడుతున్నారు. అలాగే ఉన్నత అధికారులకు ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు నిర్ణయించడంతో గ్రామీణ ఉద్యోగులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి లోనవుతున్నారు. కొంతమంది ఉన్నత అధికారులు వీరిని టార్గెట్ల కోసం మానవత్వం లేకుండా చిన్నచూపు చూస్తున్నారు

గ్రామీణ తపాల ఉద్యోగులు శ్రమ దోపిడీకిగురై ఎటువంటి ఆరోగ్య, సామాజిక, సంక్షేమ భద్రత లేకుండా జీవిస్తున్నారు. గతంలో వీరు ఎన్నోసార్లు ఆందోళన చేబడితే 14-11-2022 న్యూ దిల్లీలో నిర్వహించిన నిరాహారదీక్ష సందర్భంగా కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను అమలుపై వ్రాతపూర్వక హామీలు ఇచ్చి మూడు నెలలు గడిచినప్పటికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేబట్టక పోవడంతో సీనియర్ గ్రామీణ తపాల ఉద్యోగులకు 12,24,36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్ ఇవ్వాలని, అశాస్త్రీయ, ఆచరణ సాధ్యం కాని పొదుపు ఖాతాల, భీమా పథకాల టార్గెట్స్ పూర్తి చేయాలని, పై అధికారుల ఒత్తిడి మానుకోవాలని, ఉద్యోగులకు ప్రత్యేక వైద్య సదుపాయం కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఐదు లక్షలకు పెంచాలని, ఉద్యోగి సెలవు పెడితే వర్క్‌లోడ్ సంబంధం లేకుండా ప్రత్యామ్నాయంగా వేరొకరిని అనుమతించాలని డిమాండ్ చేస్తూ 16-3-2023 నుంచి 17-3-2023 వరకు తలపెట్టిన రెండు రోజుల దేశవ్యాప్త గ్రామీణ తపాల ఉద్యోగుల సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలపాలి.

ఆళవందార్ వేణు మాధవ్, సెల్: 8686051752

అ'విశ్వసనీయ' ముసుగు వీరులు

సీబీఐ, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ ప్రతిపక్ష నాయకుల, వారి బంధు మిత్రుల ఇళ్లు, కార్యాలయాలు తదితరచోట్ల దాడులు చేస్తుంటాయి. కానీ ఈ రెండు దర్యాప్తు సంస్థలూ దాడుల్లో ఏమేం బయటపడిందో మాత్రం చెప్పవు. అయినా ఈ సమాచారం మీడియాలో చాలా విపులంగా వస్తుంది. అధికారికంగా సమాచారం దొరకనప్పుడు మీడియా ప్రతినిధులు "విశ్వసనీయ వర్గాల ద్వారా" అని రాస్తుంటారు. ఈ విశ్వసనీయ వర్గాలు ఎప్పటికీ బ్రహ్మ పదార్థమే.

ఈ రెండు దర్యాప్తు సంస్థలు మోదీ సర్కారు పనుపున తప్ప పని చేయవు. మోదీ సర్కారు ఎవరి మీద విరుచుకుపడమంటే వారి మీదే విరుచుకు పడతాయి. మేఘాలయ, మధ్య ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో వచ్చే అవినీతి ఆరోపణలను ఈ దర్యాప్తు సంస్థలు పట్టించుకోవు. ఇటీవల మేఘాలయ శాసనసభ ఎన్నికలు జరిగిన సందర్భంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా మేఘాలయ ప్రభుత్వం అంతటి అవినీతికర ప్రభుత్వం ఎక్కడా లేదన్నారు. అయినా దర్యాప్తు సంస్థలు మేఘాలయ ప్రభుత్వం జోలికి వెళ్లలేదు. అలాగే అదానీ జోలికీ వెళ్లవు.

దర్యాప్తు సంస్థలు ఎక్కడ దాడి చేసినా మీడియాలో విశ్వసనీయ వర్గాల ఆధారంగానే బోలెడు సమాచారం వస్తుంది. దర్యాప్తు సంస్థలు స్వయంగానే సమాచారం వెల్లడించవచ్చు కదా! అలా జరగదు. దాడి చేసేది దర్యాప్తు సంస్థలైనా వార్త మాత్రం విశ్వసనీయ వర్గాల ద్వారానే తెలుస్తుంది. మీడియా వారికి విశ్వసనీయమైన వర్గాలవారు ఒకరో ఇద్దరో నలుగురో ఉండొచ్చు. ఎవరి విశ్వసనీయ వర్గాలకు వారికి ఉంటాయి. కానీ మీడియాలో వచ్చే సమాచారం అచ్చు గుద్దినట్టు ఒకేలా ఉంటుంది. అంటే ఈ విశ్వసనీయ వర్గాలు సర్వవ్యాప్తం అనుకోవాలి. దర్యాప్తు సంస్థలు దాడి చేసిన తరవాత మీడియా సమావేశం పెట్టొచ్చు, పత్రికా ప్రకటన జారీ చేయవచ్చు. అది లేనందువల్లే మీడియా విశ్వసనీయ వర్గాల మీద ఆధార పడుతుంది.

ఇటీవల లాలూ, ఆయన కూతుళ్లు, కొడుకుల ఇళ్ల మీద దాడులు జరిగాయి. దాడులు జరుగుతాయని తెలిసినందువల్లే టీవీ చానళ్ల సిబ్బంది తమ డబ్బా డవాలుతో సహా అక్కడికి చేరుకోగలిగారు. పత్రికా విలేకరులదీ అదే పరిస్థితి. కెమెరాలు మోహరించారు. దర్యాప్తు సంస్థలు తమ దాడుల ఘనకార్యానికి ప్రచారం రావాలనుకుంటాయి కానీ విశ్వసనీయ సమాచారం లేనందువల్ల తమంత తాము వివరాలు చెప్పవు. అందుకని విశ్వసనీయ వర్గాలే దిక్కు. లాలూ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.) నాయకులు మీడియాలో వస్తున్న సమాచారం సరైంది కావంటున్నాయి. అప్పుడైనా దర్యాప్తు సంస్థలు అసలు విషయం ఏమిటో చెప్పాలిగా! భూమికి బదులు ఉద్యోగం కుంభ కోణంలో 24 చోట్ల దాడులు జరిగాయని ఇందులో కోటి రూపాయల నగదు, 1900 డాలర్లు, 540 గ్రాముల బంగారం బిస్కత్తు, కిలోన్నర బంగారు ఆభరణాలు దొరికాయి అని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ ట్విట్టర్ లో వెల్లడించింది. ఈ దాడుల్లో అక్రమంగా సంపాదించిన రూ. 600 కోట్లు విలువచేసే సంపదా దొరికిందట.

24 చోట్ల దాడి జరిగితే కోటి రూపాయల నగదు, బంగారం, నగలు ఎక్కడ దొరికాయో దర్యాప్తు సంస్థలు చెప్పవు. లాలూ ఏ కూతురు ఇంట్లో ఏం దొరికిందో వివరించవు. వెలికి వచ్చిన సంపదకు భూమికి బదులు ఉద్యోగాల కుంభ కోణంతో సంబంధం ఏమిటో కూడా వివరణ ఉండదు. లాలూ ముగ్గురు కూతుర్లు, ఒక కోడలి నివాసాల మీద దాడి చేస్తే కిలోన్నర బంగారు ఆభరణాలు దొరకడం ఎందుకు ఆశ్చర్యకరమైంది. ఇవి ఎవరివో కూడా తెలియదు. ఎవరి దగ్గర ఏం దొరికిందో కూడా దర్యాప్తు సంస్థలు చెప్పవు.

సాధారణంగా ఇలాంటి దాడులు జరిగినప్పుడు పంచనామా జరుగుతుంది. పట్టుబడిన సంపద జాబితా రాస్తారు. ఆ వివరాలన్నీ పంచనామాలో ఉంటాయి. దీనిమీద రెండు పక్షాల వారు సంతకాలు చేస్తారు. అయితే ఈ మొత్తం ఎంతో దర్యాప్తు సంస్థల వాదనకు, ఆరోపణకు గురైన వారికి మధ్య పొంతన కుదరకపోతే దర్యాప్తు సంస్థలు సమాచారం అందించకపోతే నిజం ఎలా తెలుస్తుంది. లాలూ కుటుంబం ఎంత అవినీతికరమైందో నమ్మడానికి అయినా నిజం తెలియాలిగా! మీడియాలో ఈ సమాచారం అంతా విశ్వసనీయ వర్గాల ద్వారా వెలువడుతున్నప్పుడు ఆ పంచనామా వివరాలను దర్యాప్తు సంస్థలే ఎందుకు వెల్లడించవు? ఈ ప్రశ్నకు బదులుండదు. వివరాలు చెప్పిన విశ్వసనీయ వర్గాలు ఎక్కడ కాచుకుని ఉంటాయి. దర్యాప్తు సంస్థలతో పాటే సంచరిస్తూ ఉంటాయా?

హిందూ మత సంరక్షణకు కట్టుకున్న బీజేపీ నాయకుడు, కేంద్ర మంత్రి గిరిరాజు సింగ్ ఇంట్లో దొంగతనం జరిగినప్పుడు ఇంతకన్నా ఎక్కువ సంపద ఎత్తుకు పోయారట. కోటి 14 లక్షల రూపాయల నగదు, 600 డాలర్లు, నగలు తాను దొంగిలించిన మొత్తమేనని ఆ దొంగ ఒప్పుకున్నాడట. అయినా గిరిరాజు సింగ్ మాత్రం కేవలం 50వేల రూపాయల విలువగల సొత్తే పోయిందని ఫిర్యాదు చేశారు. దీనిలో మతలబు ఏమిటో చెప్పక్కర్లేదు. కర్నాటకలో ఒక బీజేపీ ప్రజాప్రతినిధి కొడుకు ఇంట్లోనుంచి భారీ మొత్తంలో నోట్ల కట్టలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నోట్ల కట్టల ఫొటోలు పత్రికల్లో వచ్చాయి. ఈ రెండు సందర్భాలలోనూ దర్యాప్తు సంస్థలు కళ్లు, చెవులు మూసుకుని నోరు తెరవలేదు.

లాలూ యాదవ్ ఒక కూతురు, అల్లుడు సింగపూర్ లో ఉంటారు. అలాంటప్పుడు వారి ఇంట్లో 1900 డాలర్లు దొరకడంలో ఆశ్చర్యపడవలసింది ఏముంది? దర్యాప్తు సంస్థలు మీడియా సమావేశం పెడ్తే ఈ సమాచారంలో నిజానిజాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. లేకపోతే విశ్వసనీయ వర్గాలే దిక్కు. దొరికిన ఈ డాలర్లకు భూమికి బదులు ఉద్యోగం కుంభకోణంతో సంబంధం ఏమిటి? లాలూ కుటుంబీకులకు డబ్బిచ్చిన వారు డాలర్ల రూపంలో ఇచ్చారా? లేదా లబ్ధి పొందిన వారు డాలర్ల రూపంలోకి మార్చారా? మారిస్తే ఆ వివరాలేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు "విశ్వసనీయ వర్గాల" దగ్గర ఉండవు. దర్యాప్తు సంస్థలే చెప్పాలి. కానీ ఆ సిబ్బంది ఏ మాట చెప్పకుండా మౌనంగా వెళ్లిపోతే ఊహాగానాలకు కొదవేముంటుంది!

భూమికి బదులు ఉద్యోగాలు కుంభకోణం 2017లో బయటపడ్డప్పుడు ఎనిమిది వేల కోట్ల రూపాయల లావా దేవీలు జరిగాయన్నారు కదా అవి ఇప్పుడు 600 కోట్లకు ఎందుకు తగ్గాయి అని తేజస్వీ యాదవ్ ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు బదులివ్వాల్సింది దర్యాప్తు సంస్థలేకదా. విచిత్రం ఏమిటంటే ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయడానికి తగిన సాక్ష్యాధారాలు లేనందువల్ల 2021లో ఈ కేసును మూసేశారు. ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం మళ్లీ తెరిచారు. లాలూ యాదవ్ కు ముడుపుల రూపంలో దక్షిణ దిల్లీలో భవనాలు ఇచ్చారన్నారు. 30 కోట్ల విలువైన ఆస్తిని డి.ఎల్.ఎఫ్. బూటకపు కంపెనీ ద్వారా అయిదు కోట్లకే కొన్నదన్నారు. దీన్ని తేజస్వీ యాదవ్ నాలుగు లక్షలకే తన పేర రాయించుకున్నారన్నారు. ఇప్పుడు ఈ ఆస్తి విలువ 150 కోట్లు అంటున్నారు. ఈ ఆరోపణలేవీ సామాన్యమైనవి కావుగా! ఈ సమాచారం అంతా దర్యాప్తు సంస్థలు మీడియా సమావేశం నిర్వహించి చెప్పి ఉంటే కొందరు విలేకరులైనా ప్రశ్నలు అడిగి అనుమానాలు తీర్చుకునే వారు. అదే వ్యవహారంలో ఇప్పుడు ఎనిమిది వేల కోట్ల కుంభకోణం కాస్తా 600 కోట్లకు కుదించుకు పోయింది. విశ్వసనీయ వర్గాల దగ్గర దీనికి సమాధానం ఉండదుగా! అప్పుడు కుంభకోణానికి సంబంధించిన పత్రాలు గట్రా దొరికాయన్నారు. తీరా ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయవలసి వచ్చేటప్పటికి తగిన సాక్ష్యాధారాలు లేవంటున్నారు.

దర్యాప్తు సంస్థలే వాస్తవాలు వెల్లడిస్తే "విశ్వసనీయ వర్గాల" అవసరం ఉండదు. కానీ నిజాలు బయటపెట్టకపోవడం వెనక మోదీ సర్కారుకు నిర్దిష్ట లక్ష్యాలు ఉన్నాయిగా!

భరద్వాజ

మహిళలు చైతన్యవంతులు కావాలి

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడంతోపాటు మరింత చైతన్యవంతులు కావాలి. తద్వారా సంఘటిత ఉద్యమాల ద్వారా సమాజంనుండి తగురక్షణ కల్పించాలి. ఇంట్లో, వీధిలోనూ మహిళలను బాధితురాలిగా చూస్తున్నారు. మహిళలకు అనేక చట్టాలు వున్నప్పటికీ అవేమీ అమలుకు నోచుకోలేదు. మహిళలకు ఎక్కడా భద్రతలేదు. "మాతృదేవోభవ" అంటూ మహిళలను మహోన్నతంగా గౌరవించాలంటారు. అది ఆచరణలో శూన్యం. పుట్టింది మొదలు పుడమి చేరే వరకు అవిశ్రాంత పయనం మహిళదే. "అర్థరాత్రి ఆడవారి స్వేచ్ఛ గమనం" అని మహాత్మాగాంధీ చెప్పినా అది కలగానే ఉంది.

అవనిలో సగం- ఆకాశంలో సగం అన్నింటా సగం మహిళలే. మహిళ లేనిదే సృష్టిలేదు. ఇది నిజం. అమ్మగా, భార్యగా, అక్క చెల్లెలుగా, గురువుగా వివిధపాత్రలు అద్భుతంగా అనితర సాధ్యంగా పోషిస్తుంది మహిళ. ఆమె సమానత్వానికి నోచుకోని దౌర్భాగ్యం. మాతృస్వామ్య వ్యవస్థలో మగువలు మగవారికన్నా హీనులుగా దీనులుగా లేరన్నది నిజం. ఆర్థత, అనురాగాలు, మాతృత్వపు మధురిమలు అన్నింటమిన్న మహిళే సర్వస్వం. అయినా మహిళపై రోజురోజుకు దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. అత్త, మామ, భర్త ఆజ్ఞలతో గర్భంలోని శిశువు ఆడపిల్లేనని భ్రూణహత్యలకు పాల్పడటం సృష్టికే ప్రమాదం. డబ్బుకు ఆశపడి తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయడం అత్యంత దారుణం - అమానుషం. కట్నపు జ్వాలలు మితిమీరిపోతున్నాయి. పేపరులో అన్నీ మహిళా సంబంధిత వార్తలే. ఈ వ్యవస్థమారాలి. అందుకు మేధావులు, ప్రజా ప్రతి నిధులు, అధ్యాపకులు, మహిళలు, పురుషులు మహిళలపై హింసా ప్రవృత్తికి నియంత్రణ చర్యలు చేపట్టాలి. వీటి అమలుకు కృషి చేయాల్సివుంది. మహిళలపై హింసానియంత్రణ వుండాలి. మహిళల్లో కూడా మార్పురావాలి. మహిళలు ప్రభంజనంలా మగ వారి దౌర్జన్యాన్ని ఎదుర్కోవాలి. భవిష్యత్‌లో ఆడమగ ఒకరినొకరు అర్థంచేసుకొని మంచిమనసుతో మెలిగితే మార్పువస్తుందని ఆశిద్దాం.

బొల్లిముంత అనూష

ప్రజాస్వామ్య స్థానే నిరంకుశత్వం

ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రజాస్వామ్యదేశాల్లో నిరంకుశధోరణులు పెరిగిపోయాయి. దాదాపు దశాబ్దికాలానికిపైగా ప్రజాస్వామ్యం దిగజారిపోతూ నిరంకుశ లక్షణాలు అధికమవుతున్నాయి. ఇలాంటి దేశాలలో భారతదేశం ఉండటం అత్యంత విచారకరం. ఇటీవల వి-డెమ్(వివిధరకాల ప్రజాస్వామ్యం) అనే పరిశోధనాసంస్థ విడుదలచేసిన నివేదికలో భారత దేశానికి సంబంధించిన అంశాన్ని కూడా ప్రముఖంగా ప్రస్తావించింది. 2023 వి-డెమ్ స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన సంస్థ. ఈ సంస్థ ప్రతి సంవత్సరం ఒక నివేదికను ప్రజాస్వామ్య విలువలపైన వెలువరిస్తుంది. దాదాపు 59 అంశాలలో ప్రతిశోధనా సూచికలను వెలువరిస్తున్నది. మన దేశానికి సంబంధించి గతంలోనే అమెరికా నుంచి పనిచేసే ఫ్రీడమ్ హౌస్ తన నివేదికలో ప్రజాస్వామ్య విలువలు క్షీణిస్తున్నాయిన పేర్కొన్నది. అయితే ఈ అంశాలపైన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అంగీకరించదు. పైగా దేశంలో వాస్తవ పరిస్థితులను కూడా బీజేపీ ప్రభుత్వం అంగీకరించే పరిస్థితిలేదు. 2014 నుంచి మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంలోనే నిరంకుశ లక్షణాలు ఉన్నాయని స్థానికంగానూ, ఇతర దేశాలలో ఉన్న సామాజిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సరిగ్గా ఇంతకంటే స్పష్టంగా వీ-డెమ్ నివేదిక తెలియజేస్తున్నది. గత పదేళ్లకాలంలో అత్యంత దారుణంగా అధ్వాన్నంగా నిరంకుశులు పాలిస్తున్న లక్షణాలుగల దేశాలలో భారతదేశం ప్రముఖంగా ముందుకు వచ్చిందని ఈ నివేదిక పేర్కొంది. నిరంకుశ ధోరణులు 2020నాటికి తీవ్రరూపం దాల్చాయి. 2022నాటికి 42దేశాలలో ప్రజాస్వామ్య లక్షణాలు మరింత దిగజారి వ్యవస్థ నిరంకుశత్వంవైపు సాగుతున్నదని నివేదిక స్పష్టంచేసింది.

నిరంకుశత్వంవైపు పరుగెడుతున్న దేశాలలో 2022 చివరినాటికి మొత్తం జనాభాలో 72శాతం(5.7బిలియన్లు) ప్రజలు నివసిస్తున్నారు. తీవ్రతరమైన నిరంకుశ దేశాలలో 2.2 బిలియన్లమంది ప్రజలు నివసిస్తున్నారు. గత 35ఏళ్ల కాలంలో ప్రజాస్వామ్య వ్యవస్థ సాధించిన అనేక విజయాలు తుడిచిపెట్టుకు పోతున్నాయి. ఈ అంశాలు సామాజిక వేత్తలను, ప్రజాస్వామ్య విలువలను కోరుకుంటున్న రాజకీయ నాయకులు, విధానాలు రూపొందిస్తున్న వారు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఉదారమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో దాదాపు 100కోట్లకు పైబడిన జనం నివసిస్తున్నారని పాలకులు నిరంకుశులుగా మారుతున్నారని నివేదిక పేర్కొంది. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్మించుకోవాలని ఈ నివేదిక కోరుతున్నది. 25 దేశాలలో భావప్రకటన స్వేచ్ఛ దిగజారింది, 47 దేశాలలో మీడియాపై ప్రభుత్వ ఆంక్షలు పెరిగాయి. 37దేశాలలో పౌరసమాజ ప్రముఖులపైన తీవ్రమైన దాడి జరుగుతోంది. 30దేశాలలో ఎన్నికల నిర్వహణలో తీవ్రమైన అవకతవకలు జరుగుతున్నాయి. అర్మీనియా, గ్రీసు, మారిషస్‌లలో ప్రజాస్వామ్య లక్షణాలు చాలావేగంగా క్షీణిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరంకుశ రాజకీయ ప్రభుత్వాల అధికారం దశాబ్దికాలంలో తీవ్రతరమైంది. 2020లో కోవిడ్-19 విజృంభించిన సమయంలో నిరంకుశ లక్షణాలు అనేక దేశాలలో స్పష్టంగా కనిపించాయి. అన్ని అధికారాలను కేంద్రం చేజిక్కించు కున్నది. కరోనా మహమ్మారిని నియంత్రించడానికి పార్లమెంటు చర్చించి తీసుకోవలసిన నిర్ణయాన్నిసైతం కేంద్రం దఖలు పరుచుకుంది. పౌరుల హక్కులను, స్వేచ్ఛను అనేక ప్రభుత్వాలు హరించాయి.

కరోనా మహమ్మారికాలంలో కార్యనిర్వహకవర్గం అసాధారణమైన అధికారాలను పొంది పౌరులకు సరైన వైద్యసౌకర్యాలను సైతం అందించ లేదు. ఉదాహరణకు హంగరీ అధ్యక్షుడు విక్టరీ ఓర్బన్ అనేక డిగ్రీలు జారీ చేసి తనకు లభించిన అసాధారణ అధికారాన్ని దుర్వినియోగపరచాడు. రాజ్యం వైద్య సంక్షోభంలోఉందన్న డిక్రీని ప్రకటించి ప్రజలనుండి వ్యతిరేకత కొనితెచ్చుకున్నాడు. అమెరికాలోని కెంటకి రాష్ట్రంలో శిలాజ ఇంధనాలకోసం ఆందోళన జరిపిన వారిపై ఆంక్షలు విధించారు. ఇజ్రాయిల్ ప్రభుత్వ నేత బెంజమిన్ నెతన్యాహు పార్లమెంటును సస్పెండ్‌చేసి తనపై విచారణ జరుగు తున్న కోర్టులను సైతం సస్పెండ్ చేశారు. ప్రజలపై నిఘాను పెంచాడు. భారతదేశం కూడా ఈ ధోరణికి దూరంగా ఏమీలేదు. 2020లో బీజేపీ నాయకత్వంలోని మోదీ ప్రభుత్వం ఆకస్మికంగా లాక్‌డౌన్ ప్రకటించింది. దేశప్రజల జీవన విధానాన్ని ఎంత తేలికగా చెల్లాచెదురు చేయగలదో ప్రభుత్వం నిరూపించింది.

భారతదేశంలో ఎన్నికల నిర్వహణలో, నిరంకు శత్వం ఉందని వీ-డెమ్ నివేదిక పేర్కొంది. గతంలో ఫ్రీడమ్ హౌస్ పాక్షికస్వేచ్ఛ ఉన్న దేశంగా భారత దేశాన్ని విశ్లేషించింది. 2021 నివేదికలోనూ ఈ సంస్థ తన నివేదికలో ఎన్నికలకు సంబంధించి భారతదేశంలో ప్రజాస్వామ్యం తప్పుదారిపడు తున్నదని పేర్కొన్నది. భారతదేశం పదేళ్లక్రితం నాటికంటే నేడు విద్యా రంగంలో స్వేచ్ఛ గణనీయంగా తగ్గిపోయిందని ఈ నివేదిక పేర్కొంది. 1975-1995 మధ్య కాలంలో ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వ స్కోరు 59నుంచి 69వరకు పెరిగింది. 2020 నాటికి ఈ స్కోరు 61కి దిగజారింది. 1975లో ఎమర్జెన్సీ విధించినకాలంలో ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వస్కోరు పైన పేర్కొన విధంగా దిగజారింది. ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థ స్కోరులో భారతదేశం 40నుండి 50శాతం(97దేశాలకుగాను) వరకు మాత్రమే ఉంది. ఎన్నికల ప్రజాస్వామ్య సూచిలోనూ భారతదేశం 108వ ర్యాంకులోఉంది. ఈ విధంగా అన్ని అంశాల సూచికలలో భారత్ తక్కువగానే ఉంది.

ఎడిట్‌పేజీ డెస్క్

మూడోరోజూ రసాభాసే

- అదానీ అంశంపై చర్చ, జేపీసీ విచారణకు విపక్షాల పట్టు
- రాహుల్ క్షమాపణకు బీజేపీ డిమాండ్
- ఉభయ సభల్లో గందరగోళం- జరగని చర్చలు - వాయిదాలతోనే సరి

న్యూఢిల్లీ: అదానీ గ్రూపు అవినీతిపై జేపీసీ విచారణ కోసం ప్రతిపక్ష పార్టీలు, రాహుల్ క్షమాపణ చెప్పాలని అధికార పక్షం పట్టుపట్టిన క్రమంలో పార్లమెంటు ఉభయసభలు మూడోరోజు రసాభాస అయ్యాయి. ఉభయ సభల్లో గందరగోళం-వాయిదాల పర్వం బుధవారం కూడా కొనసాగింది. దీంతో లోక్‌సభ, రాజ్యసభ గురువారానికి వాయిదా వేస్తూ సభాపతులు ఆదేశాలిచ్చారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగా ఆ వెంటనే అదానీ అంశంపై చర్చకు, సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణకు విపక్ష నేతలు డిమాండ్ చేశారు. అధికార పక్ష సభ్యులు కౌంటర్ నినాదాలు చేస్తూ బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలకుగాను కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో లోక్‌సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. 'సభను సాగనివ్వండి. చర్చలు జరిపేందుకు సభ నిర్వహిస్తాం, విధానాల గురించి ప్రజా సంక్షేమం గురించి మాట్లాడదాం, చర్చిద్దాం. ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రజాస్వామ్య ఆలయంగా సభను పరిగణించాలి. చట్టసభపై లోపల, బయట ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని కోరుతున్నా' అని స్పీకర్ ఓంబిర్లా అన్నారు. ప్లకార్డులను ప్రదర్శించడం మంచిది కాదు... ఇది నా హెచ్చరిక... మీరు చేస్తున్నది తప్పు అని సూచించారు. మీ స్థానాలలోకి తిరిగివెళ్లండి... మాట్లాడేందుకు సమయమిస్తానని చెప్పారు. కానీ సభ్యులు పట్టించుకోలేదు. పరస్పరం ఆరోపణలు-నినాదాలతో సభను హోరెత్తించారు. గందరగోళం నడుమ అంతర్గత సేవల (కమాండ్, నియంత్రణ, క్రమశిక్షణ) బిల్లు,2023ని రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ సభలో ప్రవేశపెట్టారు. కానీ చర్చకు వీలు లేక సభను గురువారానికి స్పీకర్ వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. ఉభయసభలు ముందుగా మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. అనంతరం పార్లమెంటు నుంచి ప్రతిపక్షాలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయానికి ర్యాలీ చేపట్టనున్నట్లు ప్రకటించాయి. భారీగా భద్రతా దళాలను మోహరించి వారిని ఈడీ కార్యాలయానికి వెళ్లకుండా కేంద్రం అడ్డుకుంది. దీంతో ప్రతిపక్ష ఎంపీలు తిరిగి పార్లమెంటుకు చేరుకోగా మధ్యాహ్నం సభలు ప్రారంభమయ్యాయి. మళ్లీ గందరగోళం నెలకొనడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు మాట్లాడమని చైర్మన్ జగదీప్ ధన్కర్ సూచించారు. అదానీ వ్యవహారంలో జేపీసీ విచారణ, ఈడీ కార్యాలయం వరకు మార్చ్ గురించి ఖర్గే చెబుతుండగానే బీజేపీ సభ్యులు నినాదాలు మొదలుపెట్టి రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో మీ సభ్యులను నియంత్రించండి అంటూ పీయూష్ గోయల్‌కు ధన్కర్ సూచించారు. 'ఈ సభలో మనమే మన భావాలను వ్యక్తం చేయలేకపోతే... ఇంకెక్కడ చేయాలి? ప్రతిపక్ష నేత ఏదో చెప్పాలనుకుంటున్నారు... చెప్పనివ్వండి. ఏం చెబుతారో వినండి. సభ క్రమశిక్షణను పాటించండి' అని సభికులకు సూచనలు చేశారు. ఖర్గే మళ్లీ మాట్లాడటం మొదలుపెట్టగానే అధికారపక్ష సభ్యులు నినాదాలతో అడ్డుకున్నారు. దీంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ధన్కర్ తెలిపారు. ఇదిలావుంటే రాజ్యసభ ప్రారంభమైనప్పుడు 267 నిబంధన కిందేడు విభాగాల్లో 11 నోటీసులు ధన్కర్‌కు అందాయి. దీనిపై ఆయన ఆదేశాలిచ్చేలోపు రాహుల్ క్షమాపణ చెప్పాలని బీజేపీ సభ్యులు నినాదాలు చేయడంతో ఎగువసభ గురువారానికి వాయిదా పడింది.

రక్షణ రంగంలోనూ 'అదానీ'

కేంద్రంపై విపక్షాల ఆగ్రహం

దేశభద్రతపైనే రాజీ ఎందుకు?: రాహుల్ ప్రశ్న

న్యూఢిల్లీ: అదానీ గ్రూపులో అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ కోసం ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. ఇందుకోసం ముక్తకంఠంతో పార్లమెంటు లోపల, బయట డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో దేశ రక్షణ రంగంలో అదానీ ప్రమేయం ఉన్నట్లు వార్తలు రావడంతో ప్రతిపక్షాల నేతలు కేంద్రప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశాయి. అదానీ గ్రూపులోని కీలక పెట్టుబడిదారుగా ఉన్నవారు రక్షణ రంగ సంస్థకు సహ-యజమాని కూడా అని వార్తానివేదిక పేర్కొంది. దీనిని విపక్షాలు తీవ్రంగా పరిగణించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ దేశ భద్రత విషయంలో రాజీపడతూ వ్యూహాత్మక రక్షణ పరికరాలపై నియంత్రణను గుర్తుతెలియని విదేశీ వ్యవస్థలకు ఎందుకు కట్టబెడుతున్నారని కేంద్రాన్ని నిలదీశారు. 'ఎలారా ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్ (ఎలారా ఐఓఎఫ్) అనేది వెంచర్ క్యాపిటల్ ఫండ్. దీనిని మారిషస్‌కు చెందిన ఎలారా కేపిటల్ నిర్వహిస్తోంది. ఈ సంస్థకు అదానీ గ్రూపు కంపెనీల్లో పెద్ద వాటా ఉంది. బెంగళూరుకు చెందిన ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రక్షణ సంస్థ ప్రమోటర్‌గా ఎలారా ఉంది. ఈ కంపెనీ 2003లో మొదలైంది. ఇస్రో, డీఆర్డీఓతో కలిసి పనిచేస్తుంది. 2020లో కాలం చెల్లిన పిచోరా మిసైల్, రాడర్ వ్యవస్థల నవీకరణ కోసం కేంద్ర రక్షణశాఖ రూ.590 కోట్ల ఒప్పందాన్ని ఇదే కంపెనీకి ఇచ్చింది' అని ఓ ప్రముఖ ఆంగ్ల పత్రిక నివేదించింది. ఈ నివేదిక స్క్రీన్‌షాట్‌ను రాహుల్ ట్విట్టర్‌లో పెట్టారు. భారత క్షిపణి-రాడార్‌ల నవీకరణ ఒప్పందన్ని అదానీకి చెందిన విదేశీ కంపెనీ ఎలారాకు ఇచ్చారు. ఎలారాను నియంత్రించేది ఎవరు? భారతదేశ భద్రత విషయంలో రాజీ పడుతూ వ్యూహాత్మక రక్షణ పరికరాలపై నియంత్రణను గుర్తుతెలియని విదేశీ సంస్థలు ఎందుకు ఇస్తున్నారు? అని కేంద్రాన్ని రాహుల్ ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా కూడా ఇదే వార్తానివేదికను ట్వీట్ చేస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. "ఛుపా రుస్తమ్' విభాగంగా ఆస్కార్ అవార్డు డీఆర్‌డీఓ-ఇండియా, పీఐబీ హోంవ్యవహారాలకు వెళు తుంది. కీలకమైన రక్షణ ఒప్పందాలు గుర్తుతెలియని విదేశీ నిధుల నియంత్రణలో ఉండటం హర్షణీయం! ఇదంతా వారి ఆప్తమిత్రుడు అదానీ కోసమే..' అంటూ వ్యంగ్యంగా ట్వీట్‌చేశారు. శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ 'భారతీయ రక్షణ రంగంలో కీలక పెట్టుబడిదారీగా అదానీ గ్రూపు, మారిషస్‌కు చెందనని ఎలారా ఐఓఎఫ్ ఉన్నాయి. 2022 డిసెంబరు వరకు 96శాతం కార్పొస్‌తో ఇవిఉన్నాయి. రక్షణ రంగ కంపెనీకి సహ-యజమానిగా ఉంటూ ఇస్రో, డీఆర్డీఓ (51శాతం వాటా ఉన్న)తో కలిపి పనిచేస్తూన్నాయి. ఇదంతా అద్భుతం... యాధృచ్ఛికం!' అని ట్వీట్ చేశారు.

బొమ్మన్, బెల్లీలకు సీఎం స్టాలిన్ ఘనసన్మానం

చెన్నై: దిక్కులేని ఏనుగులను చేరదీసి వాటి సంరక్షణను చూసే బొమ్మన్, బెల్లి దంపతుల ఇతివృత్తంగా తెరకెక్కిన భారతీయ లఘుచిత్రం 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు సొంతం చేసుకున్నది. ఇంత గొప్ప అవార్డు సాధించడంపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్న వేళ తమిళనాడు సీఎం స్టాలిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ డాక్యుమెంటరీలో ప్రధాన పాత్రధారులైన బొమ్మన్, బెల్లీ దంపతులను కలిసి నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. నీలగిరి జిల్లా మదుమలైలో ఏనుగులను తమ సొంత బిడ్డల్లా సాకుతూ ప్రశంసలు అందుకొంటున్న ఆ దంపతులకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున నగదు చెక్కులు అందజేశారు. వారికి శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించి గౌరవించినట్టు ప్రభుత్వ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ డాక్యుమెంటరీ తమిళనాడు అటవీ శాఖ పనితీరును, ఏనుగుల సంరక్షణకు చేస్తున్న ప్రయత్నాలను చూపించిందని పేర్కొన్నారు. మదుమలై, అన్నామలై ఏనుగు శిబిరాల్లో పనిచేస్తున్న 91 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాయాన్ని సీఎం స్టాలిన్ ప్రకటించారు. వారందరికీ ఇళ్ల నిర్మాణం కోసం రూ.9.10 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కోయంబత్తూరు జిల్లా అన్నామలై టైగర్ రిజర్వ్‌లో ఉన్న ఏనుగుల శిబిరాన్ని రూ.5కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు పేర్కొన్నారు. దీంతో పాటు కోయంబత్తూరు జిల్లాలోని సవాడివాయల్‌లో అవసరమైన అన్ని సౌకర్యాలతో ఏనుగుల శిబిరాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

సీఎం సన్మానం అనంతరం బొమ్మన్ మీడియాతో మాట్లాడారు. ఏనుగుల పెంపకం అంత సులువేం కాదని, పిల్లలపై చూపించిన శ్రద్ధే వీటిపైనా చూపించాల్సి ఉంటుందని తెలిపారు. మరోవైపు, సీఎం స్టాలిన్ ఆ దంపతులను కలిసి సన్మానించడం పట్ల 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' డాక్యుమెంటరీ డైరెక్టర్ కార్తికీ గోంజాల్వెస్ హర్షం వ్యక్తంచేశారు. 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' 95వ అకాడమీ అవార్డు గెలుచుకున్న తర్వాత సీఎం స్టాలిన్ బొమ్మన్, బెల్లిని సత్కరించినందుకు ఆనందంగా ఉందని, తాను గర్వపడుతున్నానని పేర్కొంటూ ట్వీట్‌చేశారు.

భారత్‌లోకి విదేశీ లాయర్లు, న్యాయ సంస్థలు

బీసీఐ నిర్ణయం

న్యూఢిల్లీ: భారత్‌లో ఫారెన్ లాను ప్రాక్టీస్ చేసేందుకు విదేశీ లాయర్లు, న్యాయ సంస్థలకు అనుమతిస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ లాయర్లు, అర్బిట్రేషన్ లాయర్లు భారత్‌లో సలహాలు ఇచ్చేందుకు వీలుగా రూల్స్ ఫర్ రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఫారెన్ లాయర్స్ అండ్ లా ఫర్మ్స్ ఇన్ ఇండియా-2022ను బీసీఐ రూపొందించింది. అయితే ఇందుకు అవసరమైన నియమనిబంధనలు రూపొందించింది. భారత్‌లో ఫారెన్ లాను ప్రాక్టీస్ చేసేందుకు వీలుగా విదేశీ లాయర్లు, న్యాయ సంస్థలకు అనుమతించే సమయం వచ్చింది. అంతర్జాతీయ లీగల్ అంశాలు, అంతర్జాతీయ మధ్యవర్తిత్వం కేసుల్లో విదేశీ లాయర్లకు భారత్‌లో లా ప్రాక్టీసుకు అనుమతించడం వల్ల లీగల్ ప్రొఫెషన్‌కు సహాయకారి అవుతుంది. ఇక్కడి లాయర్లకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని బీసీఐ పేర్కొంది. ఆంక్షలు, పూర్తి నియంత్రణ, రెగ్యులేషన్ విధానంలో విదేశీ న్యాయవాదుల ప్రాక్టీస్‌కు అనుమతించడం వల్ల భారత్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించింది. మన న్యాయవాదులు, విదేశీ న్యాయవాదులకు ఉభయతారకంగా ఉంటుందని, ఆ దిశగానే బీసీఐ నియమనిబంధలు ఉంటాయని తెలిపింది. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహంపై వ్యక్తమయ్యే ఆందోళనల పరిష్కరానికి, ఇంటర్నేషనల్ కమర్షియల్ ఆర్బిట్రేషన్ హబ్‌గా ఇండియాను తీర్దిదిద్దేందుకు వీలుగా బీసీఐ నిబంధనలు ఉంటాయని వివరించింది.

బీసీఐ నిబంధనల ప్రకారం బీసీఐ రిజిస్ట్రేషన్ లేకుండా విదేశీ న్యాయవాదులు కానీ, న్యాయ సంస్థలు కానీ లా ప్రాక్టీస్ చేయకూడదు. విదేశీ న్యాయవాది రిజిస్ట్రేషన్ ఫీజు రూ.25 వేలు, న్యాయ సంస్థ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 వేలుగా ఉంటుంది. రిజిస్ట్రేషన్ కోసం తగిన డాక్యుమెంట్లను అప్లికేషన్‌తో పాటు చేర్చవలసి ఉంటుంది. లా ప్రాక్టీస్ కోసం ఆయా దేశాల్లో ప్రాథమిక అర్హత ఏదైతే ఉంటుందో భారత్‌లో ప్రాక్టీసుకు కూడా ఇదే ప్రాథమిక అర్హతగా ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఐదేళ్ల వరకూ అది చెల్లుబాటు అవుతుంది. వాలిడిటీ తేదీ ముగియడానికి 6 నెలల ముందు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ లేదా రెన్యువల్ దరఖాస్తును సరైన కారణం ఉంటేనే తోసిపుచ్చుతుంది. కౌన్సిల్‌దే తుది నిర్ణయం. జాతీయ భద్రత కారణాల దృష్ట్యా కానీ, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కానీ, ఇతర విలువైన కారణాల రీత్యా కానీ రిజిస్ట్రేషన్ లేదా రెన్యువల్ రద్దుకు సిఫారసు చేసే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

కేరళ అసెంబ్లీలో యూడీఎఫ్ వీరంగం

తిరువనంతపురం: కేరళ అసెంబ్లీలో బుధవారం గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. స్పీకర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన విపక్ష ఎమ్మెల్యేలను పోలీసులు అక్కడి నుంచి బలవంతంగా తరలించారు. కొచ్చి డంప్‌యార్డ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై కాంగ్రెస్ కౌన్సిలర్లు చేసిన నిరసనపై పోలీసులు చర్యలు తీసుకోవడం, మహిళల భద్రత వంటి అంశాలపై మంగళ, బుధవారాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అసెంబ్లీలో వాయిదా తీర్మానాలు ఇచ్చింది. వాటిపై చర్చించేందుకు స్పీకర్ అనుమతివ్వలేదు. స్పీకర్ అధికారపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ యూడీఎఫ్ ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆదేశాల మేరకు స్పీకర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆ తర్వాత వారంతా సభ నుంచి వాకౌట్ చేసి, బ్యానర్లు పట్టుకొని స్పీకర్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లారు. లోపలికి వెళ్లేందుకు యత్నించగా భద్రతాసిబ్బంది అడ్డుకున్నారు. దాంతో వారు కార్యాలయం ముందే కూర్చుకున్నారు. మరికొందరు నేలపై పడుకున్నారు. వారిని సిబ్బంది బలవంతంగా అక్కడి నుంచి తరలించి, నిరసనను భగ్నం చేశారు.

ఇదేనా ప్రజాస్వామ్యం

బీజేపీకి అఖిలేశ్ ప్రశ్న

సంభాల్: భారతదేశ ప్రజాస్వామ్యంపై విదేశాల్లో మాట్లాడటంపై రంకెలు వేస్తున్న బీజేపీ ప్రభుత్వం భావప్రకటనా స్వేచ్ఛకు స్వదేశంలో ఇస్తున్న గౌరవం ఏపాటిదో చూడండని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఒక ఫోటోను, వీడియోను విడుదల చేశారు. ఉత్తరప్రదేశ్ విద్యాశాఖమంత్రి గులాబ్ దేవిని అభివృద్ధి పనులపై ఈనెల 12న ప్రశ్నించిన ఒక జర్నలిస్టును అరెస్టు చేశారని, ఇదేనా ప్రజాస్వామ్యమని ఆయన తన ట్వీట్‌లో ప్రశ్నించారు. 'భారత ప్రజాస్వామ్యంపై విదేశాల్లో మాట్లాడినందుకు నానా హంగామా చేస్తున్న బీజేపీ...యూపీలోని సంభాల్‌లో జర్నలిస్ట్ పరిస్థితిపైనా దృష్టి సారిస్తే బాగుంటుంది. బీజేపీ మంత్రిని అభివృద్ధి పనులపై నిలదీసినందుకు అతన్ని అరెస్టు చేశారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ ముఖచిత్రం ఇది. ఇది అప్రకటిత ఎమర్జెన్సీ, బీజేపీ ప్రభుత్వ నియంతృత్వం కాకపోతే ఏమిటి' అని అఖిలేశ్ ప్రశ్నించారు. సమాజ్‌వాదీ పార్టీ అధికారిక ట్విట్టర్‌లో దీన్ని ట్వీట్ చేశారు. కాగా, మంత్రిని జర్నలిస్టు ప్రశ్నించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. అందులో జర్నలిస్టు రానా.. మంత్రి గులాబ్ దేవి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన అభివృద్ధి పనులపై ప్రశ్నించారు. ఇది మంత్రికి ఆగ్రహం తెప్పించింది. గులాబ్ దేవి అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో అనుచితంగా ప్రవర్తించాడనే ఆరోపణపై రానాను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఆ తరువాత బెయిలుపై అతను విడుదలయ్యాడు. సోషల్ మీడియాలో ఈ వీడియో చూసిన కొంతమంది మంత్రిపై విమర్శలు గుప్పించారు.

వీసీల నియామక అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు

- నిబంధనలకు విరుద్ధంగా నియమించిన వారిని తొలగించాలి
- స్పష్టం చేసిన కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల (వీసీ)ల నియామకం, పునః నియామకం లేదా పదవీకాలాన్ని పొడిగించే అధికారం రాష్ట్రానికి లేదని కలకత్తా హైకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. 2012-2014లో పశ్చిమ బెంగాల్ విశ్వవిద్యాలయాల చట్టానికి చేసిన సవరణల ఆధారంగా బెంగాల్ ప్రభుత్వం నియమించిన లేదా పునర్నియామకం చేపట్టిన రాష్ట్రంలోని దాదాపు 29 విశ్వవిద్యాలయాల వీసీలను తొలగించాలని ప్రధాన న్యాయమూర్తి ప్రకాష్ శ్రీవాస్తవ, రాజర్షి భరద్వాజ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. విశ్వవిద్యాలయంలో వైస్-ఛాన్సలర్ పదవికి ఉన్న ప్రాముఖ్యతను ఈ కోర్టు పరిగణనలోకి తీసుకుంది కాబట్టి, వైస్ ఛాన్సలర్ నియామకం కచ్చితంగా చట్టానికి లోబడి ఉండటం చాలా అవసరమని ధర్మాసనం పేర్కొంది. తగిన విధానాన్ని అనుసరించకుండా, అర్హతలేని అధికారం ద్వారా నియమించబడ్డారని ఒకసారి తేలిన తర్వాత సంబంధిత ప్రతివాదులను విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్‌గా కొనసాగించడం విశ్వవిద్యాలయాల విద్యార్థులు, సంబంధిత పరిపాలనకు ప్రయోజనం కలిగించదని ధర్మాసనం తన 46 పేజీల తీర్పులో పేర్కొంది. 2012, 2014లో చేసిన సవరణల చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ జరిపిన అనంతరం కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజీసీ) రెగ్యులేషన్స్, 2018 ప్రకారం నిర్దేశించిన విధానం ఏమిటంటే... యూజీసీ, స్టేట్ యూనివర్సిటీ, రాష్ట్ర గవర్నర్ నామినేట్ చేసిన ప్రతినిధులతో కూడిన శోధన కమిటీ వీసీని నియమించాల్సి ఉంటుంది. పశ్చిమ బెంగాల్ విశ్వవిద్యాలయాల చట్ట చట్టాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏర్పాటు లేదా విధానాన్ని మార్చింది. యూజీసీ ప్రతినిధిని రాష్ట్రప్రభుత్వంతో భర్తీ చేసింది. ఈ సవరణలతో పశ్చిమ బెంగాల్‌లోని అనేక విశ్వవిద్యాలయాల వీసీల నియామకం, పునర్నియమించడం, పదవీకాలాన్ని పొడిగించడం కొనసాగించింది. రాష్ట్రంలో వీసీల నియామకాల తీరుపై బెంగాల్ మాజీ గవర్నర్ జగదీప్ ధన్కర్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం - అనింద్య సుందర్ దాస్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఛాన్సలర్ (గవర్నర్)కు వైస్ ఛాన్సలర్‌ను నియమించడానికి లేదా తిరిగి నియమించడానికి అధికారం ఇచ్చినప్పుడు, రాష్ట్రానికి చెందిన వైస్ ఛాన్సలర్‌ను నియమించడానికి లేదా తిరిగి నియమించడానికి చట్టంలో చేసిన సవరణల ద్వారా రాష్ట్రప్రభుత్వం ఆ అధికారాన్ని లాక్కోలేదని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. 'కలకత్తా యూనివర్సిటీ చట్టం, 1979లోని సెక్షన్ 60కి సమానమైన క్లిష్టత గల నిబంధన తొలగింపు నియమాలను అడ్డుపెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం కొంతమంది వీసీలను నియమించిందని రికార్డులో ఉన్న వాస్తవాలు సూచిస్తున్నాయి. అందుచేత అనింద్య సుందర్ దాస్ కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును దృష్టిలో ఉంచుకొని వారి నియామకాన్ని కొనసాగించడం సాధ్యం కాదు' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

ఫ్లూ భయంతో పుదుచ్చేరిలో స్కూళ్లకు సెలవు

పుదుచ్చేరి: దేశంలో హెచ్3ఎన్2 క్రమంగా విజృంభిస్తుండటం కలవరపెడుతోంది. దీంతో పుదుచ్చేరి విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇన్‌ఫ్లుయెంజా వ్యాప్తి కొనసాగుతున్నందున పది రోజులపాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. అన్ని స్కూళ్లలో 8వ తరగతి వరకు సెలవులు ఇస్తున్నామని, మార్చి 16 నుంచి 24వ తేదీ వరకు ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని రాష్ట్ర విద్యాశాఖ వెల్లడించింది. పుదుచ్చేరిలో మార్చి 11 నాటికి 79 ఇన్‌ఫ్లుయెంజా కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్‌తో ఇప్పటివరకు మరణాలు చోటుచేసుకోలేదు. కేసుల సంఖ్య పెరిగితే చికిత్స అందించేందుకు ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఇన్‌ఫ్లుయెంజా కేసులకు సంబంధించి ప్రత్యేక కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి వెల్లడించారు. కోవిడ్ తరహా లక్షణాలున్న ఈ ఇన్‌ఫ్లుయెంజా కేసులతో శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడి ఆసుపత్రుల్లో చేరుతున్నవారి సంఖ్య పెరుగుతున్నట్లు భారత వైద్య పరిశోధన మండలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇటీవల వెల్లడించాయి. జనవరి 2 నుంచి మార్చి 5వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 451 హెచ్3ఎన్2 వైరస్ కేసులు నమోదైనట్టు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. ఈ సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా కారణంగా కర్ణాటక, హరియాణా, గుజరాత్ సహా కొన్ని రాష్ట్రాల్లో మొత్తం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.

రూ.25 వేలు చెల్లించను... జైలుకే వెళ్తా

ముంబై: తాను జైలుకే వెళతానని, బెయిల్ పూచీకత్తుగా రూ.25 వేలు చెల్లించేది లేదని ఇటీవల ఎయిర్ ఇండియా విమానంలో సిగరెట్ తాగి హల్‌చల్ చేసిన వ్యక్తి చెప్పాడు. విమానంలో సిగరెట్ తాగడం, తన అనుచిత ప్రవర్తనతో తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసిన అతడిని...సిబ్బంది కాళ్లు, చేతులు కట్టేసి సీటులో కూర్చొబెట్టారు. అనంతరం విమానయాన సిబ్బంది ఫిర్యాదుతో అతడిపై కేసు నమోదయింది. ఈ క్రమంలోనే కోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసినా.. తన 'ఇంటర్నెట్' వాదనతో దాన్ని నిరాకరించి, జైలుకే వెళ్తానని చెప్పాడు. భారత సంతతికి చెందిన రత్నాకర్ ద్వివేది(37) ఇటీవల లండన్ నుంచి ముంబైకి ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణించాడు. విమానంలోని బాత్రూంకి వెళ్లి పొగ తాగుతుండగా...అప్రమత్తమైన సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. పోలీసులు అతడిని అరెస్టు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అంధేరీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు...రూ.25 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ మొత్తాన్ని చెల్లించేందుకు అతడు నిరాకరించాడు. ఇంటర్నెట్‌లో వెతికితే సంబంధిత సెక్షన్ కింద రూ.250 మాత్రమే జరిమానా ఉందని, తాను అంతే చెల్లిస్తానని వాదించాడు. కావాలంటే.. జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పాడు. దీంతో కోర్టు అతడిని జైలుకు తరలించాలని ఆదేశించింది.

డీజీపీని అరెస్ట్ చేయాలి: డీకే శివకుమార్

బెంగళూరు: కర్ణాటక డీజీపీ ప్రవీణ్ సూద్ ను అరెస్ట్ చేయాలని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడేందుకు డీజీపీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 'ఈ డీజీపీ యూజ్ లెస్... తక్షణమే కేసు నమోదు చేసి, ఆయనను అరెస్ట్ చేయాలి... ఎన్నికల కమిషన్ ఆయనను తొలగించాలి... మూడేళ్ల సర్వీసును ఆయన పూర్తి చేసుకున్నారు...ఇంకెన్నేళ్లు ఆయనను డీజీపీగా కొనసాగిస్తారు? కేవలం కాంగ్రెస్ నేతలపై మాత్రమే ఆయన కేసులు పెడుతున్నారు... మాపై ఆయన 25కి పైగా కేసులు నమోదు చేశారు' అని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే డీజీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు త్వరలోనే కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి. 224 అసెంబ్లీ స్థానాలకు గాను కనీసం 150 సీట్లను గెలవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది.

బీజేపీ ఎమ్మెల్యే బెయిల్‌ను సవాల్ చేసిన లోకాయుక్త

బెంగళూరు: కేఎస్‌డీఎల్ కుంభకోణంలో హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందిన బీజేపీ ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్ప మళ్లీ చిక్కుల్లో పడ్డారు. కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కేఎస్‌డీఎల్) కుంభకోణంలో భారీగా ముడుపులు పొందారన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ఆయనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని కర్ణాటక లోకాయుక్త సుప్రీంకోర్టులో మంగళవారం సవాల్ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం లోకాయుక్త పిటిషన్‌పై విచారణకు అంగీకరించింది. హైకోర్టు ఆదేశాల మేరకు బీజేపీ ఎమ్మెల్యే ఇప్పటికే లోకాయుక్త ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గంటలకొద్దీ ఆయనను లోకాయుక్త ప్రశ్నించినట్టు తెలుస్తోంది. లంచానికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు దొరకడంతోనే ఈ వ్యవహారంలో మరింత ముందుకు వెళ్లాలని లోకాయుక్త భావిస్తున్నట్టు తెలుస్తోంది. బీజేపీ ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్ రూ.40లక్షల లంచం తీసుకుంటుండగా ఈనెల 2న లోకాయుక్త పోలీసులు మెరుపుదాడులు నిర్వహించి పట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నివాసాల్లోనూ లోకాయుక్త పోలీసులు సోదాలు జరపగా రూ.8.23 కోట్ల మేరకు నగదు లభించిన సంగతి విదితమే. మొత్తానికి ఈ వ్యవహారం బీజేపీ ఎమ్మెల్యేను మరింత చిక్కుల్లో పడేసే సంకేతాలు కనిపిస్తున్నాయి.

వివాహిత పురుషులకు గృహ హింస

సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: వివాహితులైన పురుషులు గృహ హింసకు గురవుతున్నారని, ఫలితంగా వారిలో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పురుషుల కోసం ఓ జాతీయ కమిషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఈ పిటిషన్ కోరింది. న్యాయవాది మహేశ్ కుమార్ తివారీ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో వెల్లడించిన సమాచారం ప్రకారం 2021లో ప్రమాదవశాత్తూ సంభవించిన మరణాలు 1,64,033 అని పిటిషన్ తెలిపింది. వీరిలో 81,063 మంది పెళ్లయిన పురుషులని వెల్లడించింది. వివాహిత మహిళలు 28,680 మంది ప్రమాదవశాత్తూ మరణించినట్లు వివరించింది. మరణించిన పురుషుల్లో 33.2 శాతం మంది మరణానికి కారణం కుటుంబ సమస్యలని, 4.8 శాతం మంది మరణానికి కారణం వివాహ సంబంధితమైనవని తెలిపింది. 2021లో 1,18,979 మంది పురుషులు ఆత్మహత్య చేసుకున్నారని,45,026 మంది మహిళలు ఆత్మహత్య చేసుకున్నారని ఎన్‌సీఆర్‌బీ డేటా వెల్లడించిందని పేర్కొంది. గృహ హింస బాధిత పురుషుల ఫిర్యాదులను స్వీకరించి, విచారణ జరపాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆదేశించాలని ఈ పిటిషన్ కోరింది. గృహ హింస బాధిత పురుషుల సమస్యల పరిష్కారానికి తగిన చట్టం అమల్లోకి వచ్చే వరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి అవకాశం కల్పించాలని కోరింది. కుటుంబ సమస్యల ఒత్తిళ్లలో ఉన్నవారు, వివాహ సంబంధిత సమస్యలపై పురుషులు చేసే ఫిర్యాదులను పోలీసులు స్వీకరించాలని విన్నవించింది. దీని కోసం తగిన ఆదేశాలను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా పోలీసు అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లకు జారీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, ఈ ఫిర్యాదులు సరైనరీతిలో పరిష్కారమయ్యేందుకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు నివేదించాలని కోరింది.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడనున్నాయి. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్లను, ఆ తర్వాత బ్యాలెట్ బాక్సులను తెరచి లెక్కింపు ప్రారంభిస్తారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు పోటాపోటీగా ఎన్నికలు జరిగాయి. దీంతో ఆయా ఎమ్మెల్సీ స్థానాల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానాలను వైసీపీ కైవసం చేసుకునే అవకాశాలున్నాయి. రాత్రి 11 గంటల తర్వాత ఫలితాలు ప్రారంభమవుతాయి. రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి ముఖేశ్‌కుమార్ మీనా అధ్వర్యంలో ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్ట ఏర్పాట్లు చేశారు.

మహిళా బిల్లు ఎందుకు పెట్టరు?

మోదీ ప్రభుత్వానికి నారాయణ ప్రశ్న

న్యూదిల్లీ: పార్లమెంటులో సంపూర్ణ మెజారిటీ ఉన్నాగానీ మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టడం లేదని మోదీ ప్రభుత్వాన్ని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ప్రశ్నించారు. అసలు ఆ మేరకు ఆలోచన లేదో స్పష్టంచేయాలని అన్నారు. మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే పార్టీలకు అతీతంగా మద్దతు లభిస్తుందన్నారు. తమ పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందని తెలిపారు. బుధవారం న్యూదిల్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నారాయణ మాట్లాడారు. ఈ సమావేశానికి 13 పార్టీల నాయకులు, వేర్వేరు ప్రజా, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. చర్చావేదికలో పాల్గొన్న నాయకులు, ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఓటు వేయడంలో రాజ్యాంగ నిర్మాతలు మహిళలకు సమాన హక్కు కల్పించినప్పుడు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెంచడానికి కేంద్రప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వక్తలు ప్రశ్నించారు. ఈ అంశంపై చట్టసభల్లో ఉన్న మహిళలు ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. నారాయణ మాట్లాడుతూ గతంలో సీపీఐ ఎంపీ గీతా ముఖర్జీ మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం కృషి చేశారని గుర్తుచేశారు. తమ మిత్రపక్షాలు గతంలో అధికారంలో ఉన్నప్పటికీ పార్లమెంటులో పూర్తి మెజారిటీ లేని కారణంగా ఈ బిల్లును తేలేకపోయారని చెప్పారు. మోదీ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉన్నందున మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయించాలని నారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం మాట్లాడుతూ పితృస్వామ్య వ్యవస్థలే ఈ బిల్లుకు అడ్డు అని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు సాధనకు తమ వంతు కృషిచేస్తామని తెలిపారు. వక్తల్లో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, జేఎంఎం ఎంపీ మొహో మాఝి, ఆర్ఎల్డీ నేతలు ప్రతిభా సింగ్, భూపేంద్ర చౌదరి, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ఎస్టీ హసన్, వీసీకే ఎంపీ తిరుమావలన్, డీఎంకే ఎంపీ తమిళసై తంగపంద్యాన్ ఉన్నారు.

స్వలింగ సంపర్కుల హక్కులు పరిరక్షించాలి

కేంద్రం–సుప్రీం కోర్టుకు సీపీఐ వినతి

న్యూదిల్లీ: ఎల్‌జీబీటీక్యూఐఏ ప్లస్ వర్గీయుల (స్వలింగ సంపర్కులు) హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించాలని కేంద్రప్రభుత్వానికి, సుప్రీంకోర్టుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) బుధవారం విన్నవించింది. ఈ మేరకు పార్టీ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటన వెలువరించింది. స్వలింగ సంపర్కుల హక్కుల అంశాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేయాలన్న సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాన్ని పార్టీ పరిగణనలోకి తీసుకుంది. అయితే ఈ వ్యవహారంలో కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లడాన్ని తప్పుపట్టింది. ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో నడుస్తూ మనువాదీ దృష్టికోణాన్ని ప్రదర్శిస్తోందని కేంద్రాన్ని దుయ్యబట్టింది. ఎల్‌జీబీటీక్యూఐఏ ప్లస్ వర్గీయుల డిమాండ్ల గుర్తింపుకు నిరాకరించడం రాజ్యాంగాన్ని విరుద్ధమని, అన్ని సామాజిక వర్గాలకు హక్కులు, గౌరవప్రద జీవితానికి రాజ్యాంగం హామీనిచ్చిందని నొక్కిచెప్పింది. అనేక దేశాల్లోని ప్రభుత్వాలు ఈ వర్గీయుల విషయంలో ప్రగతిశీల దృక్పథంతో ఉన్నాయని తెలిపింది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతూ ప్రగతిని వెనక్కునెట్టే ప్రయత్నాల్లో బీజేపీ ప్రభుత్వం ఉందని విమర్శించింది. దేశంలోని తాజా పరిస్థితులతో పాటు అంతర్జాతీయ పరిణామాలను పరిగణనలోకి తీసుకొని ఎల్‌జీబీటీక్యూఐఏ ప్లస్ వర్గీయుల హక్కుల పరిరక్షణ, వారికి గౌరవప్రద జీవితాన్ని కల్పించేందుకు సానుకూలంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాన్ని సీపీఐ కోరింది.

పోలవరంపై సీఎం ఒత్తిడి తేవాలి

- ప్రాజెక్టు పూర్తయ్యే వరకు పోరాటం ఆగదు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు
- ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే సహించం: అక్కినేని వనజ

విశాలాంధ్ర –విజయవాడ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయటం కోసం కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిడి తీసుకురావాలని అఖిలపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోలవరం సాధికార సమితి అధ్వర్యంలో విజయవాడలోని ఒక హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సమాశంలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ... పోలవరం ఎత్తు ముందుగా ప్రతిపాదించిన 150 అడుగుల కంటే తక్కువగా నిర్మిస్తే ఎట్టిపరిస్థితుల్లో సహించకూడదన్నారు. వ్యవసాయరంగానికి, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ఆనాడు డిజైన్ చేశారని చెప్పారు. ఆంధ్ర రాష్ట్ర జీవనాడిగా ఉన్న పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ప్రాంతీయ అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. కృష్ణా, గోదావరి నదుల అనుసంధానంతో రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఎత్తు తగ్గిస్తే బహుళార్థసాధక ప్రాజెక్టు కాస్త బ్యారేజీగా మారుతుందని నిపుణులు సూచిస్తున్నారని, ఇటీవల సీడబ్ల్యూసీ బృందం డయాఫ్రం వాల్ దెబ్బతిందని చెప్పటం వల్ల చర్చనీయాంశం అయిందన్నారు. ఎంత మేరకు దెబ్బతిన్నది? దాన్ని ఏ విధంగా పునరుద్ధరించగలమనేది ప్రభుత్వం వివరించాలని కోరారు. 2020–21లో హైదరాబాద్ ఐఐటీ వారు నివేదిక ఇస్తే సీడబ్ల్యూసీ స్పందించలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వల్లే ఇలా జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం రకరకాల అవాస్తవాలు చెబుతోందన్నారు. ఇటీవల సీపీఐ బృందం రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను పరిశీలించటం జరిగిందని గుర్తు చేశారు. పోలవరం ముంపు మండలాలను గమనిస్తే నిర్వాసితుల సంఖ్యను తగ్గించటానికి ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన నేపథ్యంలో ఎత్తు తగ్గించటాన్ని ఒప్పుకోకూడదన్నారు. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద తగిన న్యాయం చేయాలని, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావటం కోసం కేంద్రం బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలు పక్కన పెట్టి అఖిలపక్ష నేతలు, ప్రజాసంఘాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావటానికి ఉద్యమించాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆర్థికరంగ నిపుణులు ప్రొఫెసర్ జీవీఆర్ శాస్త్రి మాట్లాడుతూ 2030–32 మధ్య కాలంలో ఏపీలో నీటిఎద్దడి తీవ్రం అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పోలవరం ఎత్తును 150 అగుడులుగా నిర్మిస్తే 43వేల ఎకరాలు అదనంగా సేకరించాల్సి ఉంటుందన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయటం తక్షణ అవసరం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన పోలవరం సాధికార సమితి కన్వీనర్ అక్కినేని భవాని ప్రసాద్ మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు నిర్మాణం జరగకపోవటంతో ఆర్థికంగా నష్టం జరుగుతోందని, వ్యవసాయ రంగం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు అవసరాన్ని గుర్తించి అందరూ కలిసి రావాలని కోరారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ సాంకేతిక అంశాలను కాకుండా పోలవరం పూర్తి చేయటం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కేంద్రం మెడలు వంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు రాబట్టాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఇటీవల గోదావరి వరదల కారణంగా 15అడుగుల ఎత్తు ఉండే విద్యుత్ స్తంభాలు మునిగిపోయిన విషయాన్ని గుర్తించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ ఖర్చులోనే నిర్వాసితులకు పునరావాసం కూడా నిర్దేశించి ఉంటుంద న్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ సభ్యులు కొలనుకొండ శివాజీ, తెలుగు రైతు సంఘం నాయకులు శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు వెలగపూడి గోపాలకృష్ణ, ఆళ్ల గోపాలకృష్ణ, వై.కేశవరావు, జెట్టి గురున్నాధం, ఎం.వెంకటేశ్వర్లు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి బృందం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: జార్ఖండ్ రాష్ట్రంలో జరుగుతున్న ఇప్టా 15 వ జాతీయ మహాసభలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 30 మంది ప్రతినిధుల బృందం బుధవారం సాయంత్రం విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరింది. జార్ఖండ్ రాష్ట్రంలో డల్ టోన్ గంజ్ పట్టణంలో మార్చి 17 నుంచి 19 వరకు జన నాట్య మంచ్ ఇప్టా అధ్వర్యంలో జాతీయ మహాసభలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రానాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.పెంచలయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్. పిచ్చయ్య , ఎస్కె నజీర్, మహంత్ లక్ష్మణారావు, ఎ.రామారావు, ఎస్. గుర్రప్ప, మారేళ్ళ శ్రీనివాసులు, శివయ్య, కుమార్ స్వామి ,జే.నాగరాజు, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు. ఈ ప్రతినిధులకు విజయవాడ నగర కార్యదర్శి డి.సూరి బాబు, చిన్నప్ప, మోహన శర్మ స్టేషన్లో వీడ్కోలు పలికారు.

వారిద్దరూ అందుకే ఆస్కార్ వేడుకలో డాన్స్ చేయలేదు!

హైదరాబాద్: 'ఆర్‌ఆర్‌ఆర్' లోని 'నాటు నాటు' బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో ఆస్కార్ అవార్డును సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే అకాడమీ పురస్కారాల్లో కొంత మంది డ్యాన్సర్స్ ఈ పాటకు స్టెప్పులేశారు. అయితే, ఒరిజినల్‌గా జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ ఈ పాటకు ఆస్కార్ వేదికపై డాన్స్ చేయాల్సి ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల ఇద్దరు హీరోలు డ్యాన్స్ చేయలేదు. దిల్లీలో పుట్టి కెనడాలో పెరిగిన నిర్మాత రాజ్ కపూర్... గత కొన్నేళ్లుగా అకాడమీతో కలసి పనిచేస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్'కు లైవ్ ప్రదర్శన ఇచ్చిన బృందంతో కలసి ఆయన పనిచేశారు. రాజ్ కపూర్ మీడియాతో మాట్లాడుతూ... హీరోలు డ్యాన్స్ ప్రదర్శన ఇవ్వకపోడంపై వివరణ ఇచ్చారు. 'ఆస్కార్ వేదికపై సింగర్స్ రాహుల్ సిప్లిగంజ్, కాల భైరవ పాటను ఆలపిస్తున్నప్పుడు హీరోలు ప్రదర్శన ఇవ్వాలి. ఫిబ్రవరి చివరలో రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరవుతున్నారని మాకు సమాచారం అందింది... కానీ, స్టేజ్‌పై లైవ్ ప్రదర్శన ఇవ్వడం వారికి ఇబ్బందిగా అనిపించింది... ఎందుకంటే ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో రిహార్సల్స్‌కు సమయం లేదని వారు భావించారు... వారు నాటు నాటు పాట చిత్రీకరణకు రెండు నెలల పాటు రిహార్సల్స్ చేశారు... 15రోజులకు పైగా షూట్ చేశారు కానీ, ఆస్కార్స్‌లో ప్రదర్శన ఇచ్చే ప్రొఫెషనల్ డ్యాన్సర్స్ మాత్రం 18 గంటల పాటు రిహార్సల్స్ చేశారు' అని రాజ్ కపూర్ తెలిపారు. ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవానికి రాజమౌళి, రమా రాజమౌళి, రామ్ చరణ్, ఉపాసన, జూనియర్ ఎన్టీఆర్, ఎమ్ఎమ్. కీరవాణి, శ్రీ వల్లీ, చంద్రబోస్, కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్, ఎస్ఎస్. కార్తికేయ తదితరులు హాజరయ్యారు. రాహుల్ సిప్లిగంజ్, కాల భైరవ 'నాటు నాటు' ను ఆస్కార్ వేదికపై పాడారు.

'మీటర్' నుంచి లిరికల్ సాంగ్ విడుదల

హైదరాబాద్: కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'మీటర్' సినిమా చిత్రీకరణ పూర్తి కావొచ్చింది. మైత్రి మూవీ మేకర్స్–క్లాప్ వారు నిర్మించిన ఈ సినిమాకి రమేశ్ దర్శకత్వం వహించాడు. పోలీస్ ఆఫీసర్‌గా కిరణ్ అబ్బవరం నటించిన ఈ సినిమాతో, తెలుగు తెరకి అతుల్య రవి కథానాయికగా పరిచయమవుతోంది. కాగా ఈ సినిమా నుంచి ఒక లిరికల్ సాంగును బుధవారం విడుదల చేశారు. సాయికార్తీక్ స్వరపరిచిన ఈ పాటకు బాలాజీ సాహిత్యాన్ని అందించగా, అరుణ్ కౌండిన్య – గాయత్రి ఆలపించారు. భాను కొరియోగ్రఫీ ఆకట్టుకుంటోంది. ఏప్రిల్ 7వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'వినరో భాగ్యము విష్ణు కథ' సినిమాతో హిట్ కొట్టిన కిరణ్... పెద్దగా గ్యాప్ లేకుండానే 'మీటర్'తో వస్తున్నాడు.

ఏప్రిల్ 7న 'రావణాసుర' విడుదల

హైదరాబాద్: రవితేజ కథానాయకుడిగా 'రావణాసుర' రూపొందింది. అభిషేక్ నామా నిర్మించిన ఈ సినిమాకి రవితేజ నిర్మాణ భాగస్వామిగా ఉన్నాడు. ఈ సినిమాకి హర్షవర్ధన్ రామేశ్వర్ – భీమ్స్ సంగీత దర్శకులుగా వ్యవహరించారు. మరింత మాస్ యాక్షన్ తో ఎనర్జిటిక్ గా కనిపించడానికి రవితేజ రెడీ అవుతున్నాడు. సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమాను ఏప్రిల్ 7వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి తాజాగా ఒక లిరికల్ సాంగును రిలీజ్ చేశారు. రవితేజ– మేఘ ఆకాశ్ పై చిత్రీకరించిన ఈ పాట... 'వెయ్యినొక్క జిల్లాల వరకూ వింటున్నాము నీ కీర్తినే'అంటూ సాగుతోంది. 1991లో వెంకటేశ్ హీరోగా వచ్చిన 'సూర్య ఐపీఎస్' సినిమాలోని పాటకు ఇది రీమిక్స్. సిరివెన్నెల రాసిన ఆ పాటకు అప్పట్లో ఇళయరాజా సంగీతాన్ని అందించారు. ఇప్పుడు ఆ పాటను అనురాగ్ కులకర్ణి ఆలపించాడు. ఈ సినిమాలోని ఇతర ముఖ్య పాత్రలలో అనూ ఇమ్మాన్యుయేల్ .. ఫరియా అబ్దుల్లా .. దక్ష నగార్కర్ ... రావు రమేశ్ .. మురళీ శర్మ .. సంపత్ రాజ్ కనిపించనున్నారు.

ఏప్రిల్ 9న ఏపీఓఏ ఎన్నికలు

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ) ప్రత్యేక వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) ఏప్రిల్ 9న చిత్తూరులో జరగనుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ఈ మేరకు ఎన్నికను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ) ప్రత్యేక వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) నిర్ణయించింది.అలాగే ఈ ఎన్నికల్లో ఓట్లు వేయడానికి 25 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్లను ప్రత్యేక ఏజీఎం ఆమోదించింది. ఏపీఓఏ కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకోవడానికి దాదాపు 50 మంది స్పోర్ట్స్, గేమ్స్ ప్రతినిధులు తమ ఓట్లను వేయనున్నారు. బుధవారం విజయవాడలోని హోటల్ ఐలాపురంలో ఏపీఓఏ ప్రత్యేక వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది. ఏపీఓఏ అధ్యక్షుడు ధర్మాన కృష్ణ దాస్ స్థానంలో, మాజీ ఒలింపియన్ ఏ పీ ఓ ఏ సంయుక్త కార్యదర్శి ఎం.వి మాణిక్యాల రావు ప్రత్యేక వార్షిక జనరల్ బాడీ సమావేశానికి అధ్యక్షత వహించారు. అనంతరం ఏపీఓఏ ప్రధాన కార్యదర్శి ఆర్కే పురుషోత్తం మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఏజీఎం తీర్మానాలను వివరించారు. సుమారు 22 మంది స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక ఏజీఎంకు హాజరయ్యారని, వివిధ కారణాల వల్ల సమావేశానికి హాజరు కాలేకపోతున్నామని ముగ్గురు ప్రతినిధులు అనుమతి తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ఆరు క్రీడా సంఘాలకు గుర్తింపు ఇచ్చేందుకు ప్రత్యేక ఏజీఎం అంగీకరించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్, జూడో, తైక్వాండో, సెపక్ తక్రా అసోసియేషన్‌లకు ఏపీఓఏ గుర్తింపు లభించిందన్నారు.. ఈ సంఘాలన్నీ ఎపీఓఏజనరల్ బాడీ సమావేశానికి ముందే కొత్త కార్యవర్గ ఎన్నికలను పూర్తి చేయాలని ఆయన సూచించారు. జాతీయ క్రీడల గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) సకాలంలో స్పందించకపోవడంతో 2027లో జాతీయ క్రీడలను నిర్వహించే అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్ కోల్పోయిందన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానం చేసి, శాప్, ఏపీఓఏ ద్వారా ఐఓఏకి లేఖ పంపినట్లయితే, రాష్ట్రం 2027 జాతీయ క్రీడల రేసులో నిలిచి ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. 2036లో దేశంలో ఒలింపిక్స్‌ను నిర్వహించే బిడ్డింగ్‌లో భారత ఒలింపిక్ సంఘం పాల్గొంటుందని, అక్టోబరులో ముంబైలో వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒలింపిక్స్‌ను భారత్‌కు కేటాయిస్తే 15 రాష్ట్రాల్లో క్రీడా మౌలిక సదుపాయాలు ఏర్పడతాయన్నారు. ఏపీఓఏ ఉపాధ్యక్షుడు సమరనాథ్‌రెడ్డి, కోశాధికారి జీ శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

నం.1 టెస్టు బౌలర్ అశ్విన్

ముంబై: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అహ్మదాబాద్‌లో జరిగిన ఆఖరి టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన రవిచంద్రన్ అశ్విన్, రెండో ఇన్నింగ్స్‌లో ఓ వికెట్ పడగొట్టాడు. టెస్టు సిరీస్‌లో 4 మ్యాచుల్లో 25 వికెట్లు, టాప్ వికెట్ టేకర్‌గా 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' గెలిచిన అశ్విన్... ఐసీసీ నం.1 టెస్టు బౌలర్‌గా అవతరించాడు. మూడేళ్లుగా ఐసీసీ నం.1 టెస్టు బౌలర్‌గా కొనసాగుతున్న ప్యాట్ కమ్మిన్స్, దిల్లీలో జరిగిన రెండో టెస్టు ముగిసిన తర్వాత తన స్థానాన్ని కోల్పోయాడు. 42 ఏళ్ల జేమ్స్ అండర్సన్, ఐసీసీ నం.1 బౌలర్‌గా వారం రోజుల పాటు అగ్రస్థానంలో ఉన్నాడు. మూడో టెస్టు ముగిసిన తర్వాత అశ్విన్... అండర్సన్‌ని వెనక్కి నెట్టి ఐసీసీ నం.1 టెస్టు బౌలర్‌గా అవతరించాడు. న్యూజిలాండ్‌తో రెండో టెస్టు ముగిసిన తర్వాత మళ్లీ తన ర్యాంకు మెరుగుపర్చుకున్న జేమ్స్ అండర్సన్, రవిచంద్రన్ అశ్విన్‌తో కలిసి సంయుక్తంగా టాప్‌లో నిలిచాడు. తాజాగా అహ్మదాబాద్ టెస్టులో 7 వికెట్లు పడగొట్టిన రవిచంద్రన్ అశ్విన్, 869 పాయింట్లతో అండర్సన్‌ని వెనక్కి నెట్టేశాడు. జేమ్స్ అండర్సన్ 859 పాయింట్లతో రెండో స్థానంలో ఉంటే, ప్యాట్ కమ్మిన్స్ 841 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. కగిసో రబాడా–4, షాహీన్ అఫ్రిదీ ఐదో స్థానంలో ఉన్నాడు. గాయంతో జట్టుకు దూరమైన జస్ప్రిత్ బుమ్రా ఏడో స్థానానికి పడిపోగా, రవీంద్ర జడేజా టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉన్నాడు.

మెరుగైన కోహ్లీ ర్యాంకు

కాగా అహ్మదాబాద్ టెస్టులో 186 పరుగులు చేసి, మూడేళ్ల తర్వాత సెంచరీ అందుకున్న విరాట్ కోహ్లీ... తన ర్యాంకుని 7 స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. 2021 జనవరిలో నం.1 టెస్టు బ్యాటర్‌గా ఉన్న విరాట్ కోహ్లీ... మెల్లిమెల్లిగా టాప్ 10 దాటి, టాప్ 19లోకి పడిపోయాడు. అహ్మదాబాద్ టెస్టు ముగిసిన తర్వాత 7 స్థానాలు ఎగబాకి 13వ స్థానానికి వచ్చాడు విరాట్ కోహ్లీ. జులై 2022లో టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్ 10 నుంచి పడిపోయిన విరాట్ కోహ్లీ... నాలుగు నెలల కాలంలో టాప్–15లోకి రావడం ఇదే తొలిసారి. టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రిషబ్ పంత్ 9వ స్థానానికి పడిపోగా, రోహిత్ శర్మ 10వ స్థానంలో కొనసాగుతున్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా అగ్రస్థానాన్ని కాపాడుకోగా రవిచంద్రన్ అశ్విన్ రెండో స్థానంలో, అక్షర్ పటేల్ నాలుగో స్థానంలో ఉన్నారు. అహ్మదాబాద్ టెస్టుకి ముందు టాప్ 5లో ఉన్న అక్షర్ పటేల్, టాప్–4కి రాగా షకీబ్ అల్ హసన్ మూడు, బెన్ స్టోక్స్ ఐదో స్థానంలో ఉన్నారు. కాగా వన్డే బౌలర్ల ర్యాంకింగ్స్‌లో మహ్మద్ సిరాజ్ తన నం.1 స్థానాన్ని కాపాడుకున్నాడు. అయితే సిరాజ్ ఖాతాలో 729 పాయింట్లు ఉండగా జోష్ హాజిల్‌వుడ్ ఖాతాలో 727 పాయింట్లు ఉన్నాయి. మహ్మద్ సిరాజ్ నం.1గా కొనసాగాలంటే ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో సత్తా చాటాల్సి ఉంటుంది. కాగా శుబ్‌మన్ గిల్ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టాప్–6లో కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లీ–7లో, రోహిత్ శర్మ 9వ స్థానంలో ఉన్నారు.

ఆ సెంచరీ కోహ్లీ అత్యుత్తమ ఇన్నింగ్స్ కాదు

మార్క్ వా

మెల్‌బోర్న్: టెస్టుల్లో మరోసారి మూడంకెల స్కోరు చేరుకోవడానికి విరాట్ కోహ్లీకి దాదాపు మూడున్నరేళ్ల సమయం పట్టింది. బోర్డర్–గావస్కర్ ట్రోఫీలోని చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 186 పరుగులు చేసి, తన సెంచరీ కరువును తీర్చుకోవడమే కాకుండా.. విమర్శకులకు ఈ ఇన్నింగ్స్‌తోనే సమాధానమిచ్చాడు విరాట్. ఈ శతకంపై సీనియర్ క్రికెటర్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. అయితే ఆసీస్ మాజీ ఆటగాడు మార్క్‌వా మాత్రం కాస్త భిన్నంగా స్పందించాడు. నాగ్‌పుర్ టెస్టులో క్యాచ్‌లు డ్రాప్ చేశాడని కోహ్లీపై విమర్శలు గుప్పించిన వా... నాలుగో టెస్టులో కోహ్లీ ఇన్నింగ్స్‌ను మెచ్చుకున్నాడు. అయితే కోహ్లీ అసలైన అత్యుత్తమం మాత్రం ఇది కాదని చెప్పాడు. "కోహ్లీ సెంచరీ కరువు తీరింది. పరుగుల గేట్లు తెరుచుకున్నాయి. కానీ.. అతడు చాలా తక్కువ రిస్కీ షాట్లు ఆడాడు. ఎంతో ఓపికగా ఉన్నాడు. అయితే అతడి టెస్టు కెరీర్‌ను పరిశీలిస్తే... ప్రస్తుతానికి అతడి అత్యుత్తమ ఇన్నింగ్స్ ఇదేనని నేను అనుకోవడం లేదు. కానీ ఇది అతడిలోని క్లాస్ ఆట" అని మార్క్‌వా విశ్లేషించాడు. మొదటి టెస్టులో స్లిప్‌లో ఉన్న కోహ్లీ... స్మిత్, హాండ్స్‌కాంబ్ క్యాచ్‌లను వదిలివేయడంపై కామెంటరీ బాక్స్ నుంచి వా విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఇక కోహ్లీ ఈ మ్యాచ్‌లో తన 28వ టెస్టు సెంచరీని నమోదు చేయగా, మొత్తంగా అన్ని ఫార్మాట్లలో కలిపి 75 శతకాలు చేశాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.